
ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి
5
నాగర్‌కర్నూల్
జిల్లా వార్తలు
మంగళవారం 12 నవంబరు 2024
ఉష్ణోగ్రతలు గరిష్ఠం : 30.0 కనిష్ఠం : 20.0



చేనులోనే పత్తి

- కూలీలు దొరకక ఇబ్బంది పడుతున్న రైతులు
- పంటలన్నీ ఒకే సారి దిగుబడి రావడంతో లేబర్‌కు పెరిగిన డిమాండ్
- రూ.400 నుంచి రూ.600 ఇచ్చినా కొరతే
- ఇతర ప్రాంతాలకు వెళ్లినా దొరకని కూలీలు
- పంట పొలంలోనే నల్లబారుతున్న తెల్లబంగారం



కూలీల కొరత ఏర్పడడంతో అమ్రాబాద్ మండల కేంద్రానికి చెందిన రైతు చేనుపైనే మిగిలిపోయిన పత్తి

అచ్చంపేట/అమ్రాబాద్, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): వ్యవసాయంలో ప్రధాన భూమిక పోషించేది కూలీలే. సాగు ముందుకు సాగాలంటే కూలీల పాత్ర కీలకంగా మారింది. విత్తనాలు వేసే నాటి నుంచి పంట ఇంటికి చేరేదాకా కూలీలు ఉండాల్సిందే.. ఆధునిక కాలంలో వ్యవసాయంలో రైతుకు అందుబాటులోకి ఎన్నో పరికరాలు వచ్చాయి. కానీ పత్తి, మిర్చి సాగుచేసిన రైతులకు మాత్రం ఎలాంటి పరికరాలు అందుబాటులో లేకపోవ డంతో కూలీల కొరత తీవ్రంగా వేధిస్తున్నది. నాగర్ కర్నూల్ జిల్లాలో పత్తి పంట 2,11,449 ఎకరాల్లో సాగు చేశారు. ఒక ఎకరాకు పంట పూర్తి కాలం నాటికి ఎకరాకు సుమారు 30 నుంచి 40 మంది కూలీలు అవ సరం ఉంటుంది. ఎక్కువ విస్తీర్ణంలో పంటలు సాగు చేసే రైతులకు కూలీలు దొరకకపోవడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పత్తిపంట ఒకేసారి చేతికి రావడంతో స్థానికంగా ఉన్న కూలీలకు డిమాండ్ పెరిగింది. రవాణా చార్జీలు, ఇతర ఖర్చులు పోను రోజుకు రూ.400 నుంచి 600 వరకు డిమాండ్ చేస్తున్నారు. అయినా స్థానికంగా కూలీలు దొరకడం లేదు. దీంతో రైతులు కూలీల కోసం పక్క జిల్లాలకు వెళ్తున్నారు. అక్కడ కూడా అదే డిమాండ్ చేయడం, కూలీలు దొరకకపోవడంతో పత్తి చేనులోనే మగ్గుతోందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చేసేది లేక కూలీ అధికంగా చెల్లించి తీసుకువస్తున్నారు. దీంతో ఖర్చులు పెరగడంతో పెట్టుబడి కూడా వెళ్తుందో లేదో అని పత్తిసాగు చేసిన రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

కిలోల చొప్పున తీసున్న కూలీలు

రోజు వారి కూలీ కాకుండా వ్యవసాయ పనులు సకాలంలో పూర్తి కావాలని, కిలో పత్తి తీస్తే రూ.13 నుంచి రూ.15 వరకు చెల్లిస్తూ కొందరు రైతులు సకాలంలో పనులు పూర్తి కావాలని పత్తి పంటను తీయిస్తున్నారు. ఈ క్రమంలో ఎకరాకు ఎనిమిది నుంచి పది క్వింటాళ్ల దిగుబడి వస్తే కూలీలకే రూ.15 వేలు చెల్లించాల్సి వస్తోందని రైతులు వాపోతున్నారు.



పత్తి తీసేందుకు ఇతర ప్రాంతాల నుంచి ఆటోలో వస్తున్న కూలీలు

అప్పులపాలవుతున్నాం



ఏడు ఎకరాల భూమిని కౌలుకు తీసుకొని పత్తి సాగు చేశాను. కౌలు ఎకరానికి రూ.5 వేల చొప్పున ఏడెకరాలకు రూ.35 వేలు చెల్లించాలి. కూలీలకు లక్షకు పైగా ఖర్చు అవుతోంది. ఈ ఏడాది పెట్టుబడి కూడా వెళ్లేటట్లు లేదు.

- నేనావత్ జ్యోతి, ఎద్దుమిట్టతండా

మద్దతు ధర పెంచాలి



పత్తి తీసేందుకు కూలీల కొరత తీవ్రంగా వేధిస్తున్నది. స్థానికంగా కూలీలు దొరకకపోవడంతో పక్క గ్రామాలు, పక్క జిల్లాల నుంచి కూలీలను తీసుకువస్తున్నారు. దీంతో రైతుకు పెట్టుబడి ఖర్చులు పెరిగిపోతున్నాయి. పత్తి రైతులను అప్పుల బారి నుంచి కాపాడాలంటే ప్రభుత్వం క్వింటాలు పత్తికి రూ.10 వేలు మద్దతు ధర ప్రకటించాలి.

- ఎస్, హుస్సేన్, జంగం రెడ్డిపల్లి అమ్రాబాద్ మండలం

నేడు భరోసా సెంటర్ ప్రారంభోత్సవం

- హాజరు కానున్న మంత్రులు దామోదర రాజనర్సింహ, జూపల్లి

గద్వాల క్రైం, నవంబరు 11(ఆంధ్రజ్యోతి) : జిల్లా కేంద్రంలోని ప్రాక్టీసింగ్ హైస్కూల్ పక్కన మంగళవారం ఉదయం 11 గంటలకు నూతనంగా నిర్మించిన భరోసా మహిళా, బాలల సహాయక కేంద్రాన్ని ప్రారంభించనున్నట్లు ఎస్పీ శ్రీనివాసరావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ భరోసా సెంటర్ ప్రారంభోత్సవానికి ముఖ్య అతిథులుగా రాష్ట్ర ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ, ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు, ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి, జిల్లా కలెక్టర్ బీఎం. సంతోష్ హాజరవుతున్నారని ఎస్పీ తెలిపారు.

జాతరలో జనం సందడి

- కురుమూర్తి క్షేత్రానికి తరలివస్తున్న ప్రజలు
- దాసంగాలు సమర్పించి మొక్కులు తీర్చుకుంటున్న భక్తులు

7



జాతర మైదానంలో భక్తుల దాసంగాలు

నిందితులను శిక్షించాలి

- పోలీస్‌స్టేషన్ ఎదుట ఆందోళన



పోలీస్‌స్టేషన్ ఎదుట ఆందోళన చేస్తున్న గిరిజనులు

వెల్దండ, నవంబరు 11 : నాలుగురోజుల క్రితం మండలంలోని ఎంజీ కాలనీ తండాలో ఓ గిరిజన రైతును హత్యచేసిన సంఘటనలో పోలీసులు పారదర్శకంగా వ్యవహరించి నిందితులను పట్టుకుని శిక్షించాలంటూ గిరిజనులు సోమవారం వెల్దండ పోలీస్‌స్టేషన్ ఎదుట ఆందోళన చేపట్టారు. ఈనెల ఎనిమిదిన ఎంజీ కాలనీ తండాకు చెందిన రాత్లావత్ రాజునాయక్ అనే రైతు తన భార్య హిమబిందుతో కలిసి రాత్రి సమయంలో సమీపంలోని వ్యవసాయ పొలానికి వేరుసెనగ పంటకు కాపలాగా వెళ్లాడు. ఇద్దరు పడుకుని ఉన్న క్రమంలో తెల్లవారుజామున గుర్తుతెలియని వ్యక్తులు రాజునాయక్‌ను హత్యచేశారు. దీంతో హిమబిందు చుట్టుప్రక్కన రైతులకు విషయాన్ని చేరవేసింది. పోలీసులు సంఘటనాస్థలానికి చేరుకుని డాగ్‌స్క్వాడ్, క్లూస్‌టీంతో విచారణ చేపట్టారు. కాగా మృతుడి భార్య, తండాకు చెందిన ఓ వ్యక్తి, మరో బాలుడు, హైదరాబాద్‌కు చెందిన మరో ఇద్దరితో కలిసి రాజునాయక్‌ను హత్యచేసినట్లు గ్రామంలో ప్రచారం జరిగింది. కాగా పోలీసులు అప్పటికే సదరు వ్యక్తులను అదుపులోకి తీసుకొని విచారణ జరుపుతున్నట్లు తెలిసింది. కాగా కేసులో తండాకు చెందిన వ్యక్తిని తప్పించే ప్రయత్నాలు జరుగుతున్నాయని స్థానికులు ఆరోపిస్తూ సోమవారం స్టేషన్ ఎదుట ఆందోళన చేపట్టారు. దీంతో ఎస్‌ఐ కురుమూర్తి ఆందోళకారులను శాంతపరిచారు. నిందితులను గుర్తించి శిక్షపడేలా చూస్తామని, ఎటువంటి అపోహలకు తావులేదని స్పష్టం చేశారు. దీంతో గిరిజనులు ఆందోళన విరమించారు.

సీడ్ ఆర్గనైజర్ బండ్ల రాజశేఖర్ రెడ్డి అరెస్ట్

- కర్ణాటక రాష్ట్రం, రాయిచూరులో పట్టుబడిన నిందితుడు
- వెల్లడించిన సీఐ టంగుటూరి శ్రీను



వివరాలు వెల్లడిస్తున్న సీఐ టంగుటూరి శ్రీను

7

బాల బ్రహ్మేశ్వర స్వామి ఆలయంలో భక్తుల రద్దీ

అలంపూరు, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి):అలంపూరు జోగుళాంబ బాల బ్రహ్మేశ్వర స్వామి దేవస్థానంలో కార్తీక మాసం రెండో సోమవారం భక్తుల రద్దీ నెలకొంది. స్వామి, అమ్మ వార్లను దర్శించుకున్నారు. తుంగభద్ర నది పుష్కర ఘాట్ వద్ద స్నానాలు ఆచరించి, ఆలయం ఎదుట కార్తీక దీపాలు వెలగించారు. స్వామికి అభిషేకాలు, అమ్మవారికి అర్చనలు నిర్వహించారు. సాయంత్రం నదీహారతి, సాంస్కృతిక కార్యక్రమాలు చేపట్టారు.



డబుల్ క్లైమ్ కేసులో పురోగతి

- కోర్టులో లొంగిపోయిన నిందితుడు
- రిమాండ్‌కు తరలింపు

7

అనర్హులకు ఉద్యోగాలు

- డిగ్రీలో హిందీ సబ్జెక్టు లేకపోయినా ఎంపిక
- నోటిఫికేషన్ నిబంధనలను తుంగలో తొక్కిన అధికారులు
- న్యాయం చేయాలని కలెక్టర్‌ను వేడుకున్న అభ్యర్థులు



అదనపు కలెక్టర్ నర్సింగరావుకు వినతి పత్రం అందిస్తున్న అభ్యర్థులు

గద్వాల, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయ నియామకాలలో నోటిఫికేషన్‌కు విరుద్ధంగా అధికారులు వ్యవహరించడంతో అనర్హులకు ఉద్యోగాలు వచ్చాయని అర్హులైన హిందీ పండిట్లు ఆరోపిస్తున్నారు. ఖమ్మం జిల్లాలో ఏవిధంగా జరిగిందో గద్వాల జిల్లాలో కూడా అనర్హులను ఎంపిక చేయడంతో అర్హులకు అన్యాయం జరిగిందని వారు వాపోతున్నారు. సోమవారం అదనపు కలెక్టర్ నర్సింగరావును కలిసి వినతి పత్రం అందించారు. కలెక్టర్ స్పందిస్తూ విచారణ జరుపుతామని హామీ ఇచ్చినట్లు తెలిపారు. ఈ సందర్భంగా షేక్‌షావలి మాట్లాడుతూ జోగుళాంబ గద్వాల జిల్లాలో 2024 సంవత్సరంలో ఉపాధ్యాయుల నియామకాలలో హిందీ పండిట్ల ఎంపికలో అవకతవకలు జరిగాయని ఆరోపించారు. నోటిఫికేషన్‌లో పేర్కొన్నట్లు మూడేళ్ల డిగ్రీ కోర్సులో తప్పనిసరిగా హిందీ ఉండాలని, డిగ్రీలో సెకెండ్ లాంగ్వేజ్ హిందీ తీసుకుంటే ఎంఏ హిందీ చేసినవారే అర్హులవుతారని అన్నారు. కొందరు ఒకేసారి డిగ్రీ డిస్టేన్స్‌లో పీజీ చేశారని, ఈ రెండు సర్టిఫికెట్లను ఒకేసారి వాడటానికి వీలులేదని తెలిపారు. నోటిఫికేషన్‌లో పేర్కొన్నట్లుగా డిగ్రీలో హిందీ సబ్జెక్టు లేకపోయినా ఎంపిక చేశారని ఆరోపించారు. రెండు నెలల క్రితం రాష్ట్ర ప్రభుత్వం గురుకుల పాఠశాలల్లో ఇలాంటి వారిపై అనర్హత వేటు వేస్తే ఇక్కడ ఎలా ఎంపిక అవుతారని ప్రశ్నిం చారు. సర్టిఫికెట్ల వెరిఫికేషన్‌లో అధికారులు నిబంధనలు పాటించలేదని వాయారు. జిల్లాలో ఎంపికైన 12 మంది హిందీ పండిట్లలో చాలా మంది అర్హత లేనివారేనని ఫిర్యాదులో పేర్కొన్నట్లు తెలిపారు. సర్టిఫికేట్ వెరిఫికేషన్ సమయంలోనే ఇన్‌చార్జి డీఈవో రవీందర్‌కు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని వాపోయారు. ఖమ్మం జిల్లాలో ఈ విధంగా ఎంపికైన ఏడుగురు హిందీ పండిట్లను కలెక్టర్ విచారణ చేసి తొలగించారని, గద్వాల జిల్లాలో కూడా విచారణ చేసి అర్హులైన తమకు న్యాయం చేయాలని కోరారు.



గోపాల్‌పేట కొనుగోలు కేంద్రం వద్ద ధాన్యాన్ని ఆరబోసిన రైతులు

అన్నదాతల పడిగాపులు

- ధాన్యం సేకరణలో ఆలస్యం
- ఆందోళన చెందుతున్న రైతులు
- జిల్లా వ్యాప్తంగా 379 కేంద్రాలకు ప్రారంభించింది 183 కేంద్రాలే
- కేంద్రాల వద్ద నిలిచిన ధాన్యం
- నుర్పిడి, మాల్ వెయింగ్ మిషన్‌ల కొరతతో ఆలస్యమవుతోందని ఆరోపణలు
- త్వరగా కొనుగోలు చేయాలని వేడుకుంటున్న అన్నదాతలు

6

వనపర్తి జిల్లాలో వరి కోతలు ముమ్మరంగా సాగుతున్నాయి. కొనుగోలు కేంద్రాలకు ధాన్యం పోటెత్తుతోంది. లక్ష్యం మేర కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయకపోవడంతో అన్నదాతలు ఇబ్బంది పడుతున్నారు. కొన్ని ప్రాంతాల్లో నేటికీ కేంద్రాలను ప్రారంభించలేదు. మరికొన్ని ప్రాంతాల్లో కేంద్రాలు ప్రారంభించినా కొనుగోలు చేయడం లేదు. కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసే ప్రదేశంలో ఆరబెట్టిన ధాన్యం సేకరించకపోవడంతో రైతులు రాత్రింబవళ్లు పడిగాపులు కాస్తున్నారు. ధాన్యం సేకరణ ఆలస్యం కావడంతో కొనుగోలు కేంద్రాలకు తీసుకువచ్చిన ధాన్యాన్ని కాపాడుకోవడానికి రైతులు నానా తంటాలు పడుతున్నారు. అకాల వర్షాలు వస్తే మా పరిస్థితి ఏంటని వాపోతున్నారు. మూలమళ్లలో కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు కానీ ధాన్యం సేకరించడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

- వనపర్తి అర్బన్, ఆంధ్రజ్యోతి

ప్రతీ ఇంటిని సర్వే చేయాలి



అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ ఆదర్శ్ సురభి

వనపర్తి రాజీవ్‌చౌరస్తా, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి) : సమగ్ర కుటుంబ సర్వేలో ప్రతీ ఇంటిని సర్వే చేయాలని కలెక్టర్ ఆదర్శ్ సురభి ఆదేశించారు. సోమవారం ఐడీవోసీ సమావేశ మందిరం నుంచి తహసీల్దార్, మండల అభివృద్ధి అధికారులు, మునిసిపల్ కమిషనర్లతో వీసీలో మాట్లాడి పలు సూచనలు చేశారు. సమాచార సేకరణలో తప్పులకు అవకాశం ఇవ్వకుండా జాగ్రత్తగా సర్వే చేయాలని సూచించారు. ఎన్ని ఇళ్లు సర్వే పూర్తి చేశారు అనే వివరాలు ప్రతీ రోజు సాయంత్రం 5:30 గంటలలోపు స్ప్రెడ్ షీట్‌లో నమోదు చేయాలని సూచించారు.

అనుమతి లేకుండా సెలవులు తీసుకోవద్దు

సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే నిర్వహిస్తున్న సిబ్బంది అనుమతి లేనిదే సెలవు తీసుకోవడానికి వీలు లేదని కలెక్టర్ ఆదర్శ్ సురభి సూచించారు. సోమవారం కుటుంబ సర్వేపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఇప్పటి వరకు సర్వే పూర్తి చేసిన ఇళ్ల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ప్రతీ ఎన్యుమరేటర్ రోజుకు కనీసం 10 కుటుంబాలు సర్వే పూర్తి చేయాలని సూచించారు. సోమవారం సాయంత్రం వరకు 30,517 కుటుంబాల సర్వే పూర్తయిందని, ఇందులో గ్రామీణ ప్రాంతంలో మొత్తం 23,742 కుటుంబాలు కాగా మునిసిపాలిటీల్లో 6775 కుటుంబాలను సర్వే చేసినట్లు చెప్పారు. అదనపు కలెక్టర్ సంచిత్ గంగ్వార్, సీపీవో భూపాల్‌రెడ్డి, సంక్షేమ అధికారి లక్ష్మమ్మ, ఏవో భానుప్రకాష్, తహసీల్దార్ రమేష్ రెడ్డి, కిషన్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

ఐకేపీ వీవోఏల సమస్యలు పరిష్కరించాలి

- కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించిన వీవోఏలు

నాగర్‌కర్నూల్ టౌన్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): ఐకేపీలో పని చేస్తున్న వీవోఏల సమస్యలను పరిష్కరించాలని వీవోఏల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రాజ్‌కుమార్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం సీఐటీయూ ఆధ్వర్యంలో ఐకేపీ వీవోఏల సంఘం కలెక్టరేట్ ఎదుట 48 గంటల ధర్నాను ప్రారంభించారు. ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షుడు రాజ్‌కుమార్ మాట్లాడుతూ గ్రామ మహిళా సంఘాల బలోపేతానికి నిరంతరం కృషి చేస్తున్న ఐకేపీ వీవోలకు కనీస వేతనం రూ.20 వేలు చెల్లించి ఉద్యోగ భద్రత కల్పించాలని ఆయన కోరారు. ఐకేపీ వీవోఏల సంఘం జిల్లా గౌరవ అధ్యక్షుడు పర్వతాలు, కోశాధికారి సుమలత, ఐద్వా జిల్లా కార్యదర్శి గీత, సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్.శ్రీనివాస్, సహాయ కార్యదర్శి రామయ్య, యూనియన్ నాయకులు అంజయ్య, దేవన్న, మల్లేష్, సుమతి, రామస్వామి, జంగయ్య, జంగమ్మ, వెంకటస్వామి తదితరులు పాల్గొన్నారు.

తాలు, తేమ పేరుతో
రైతులను ఇబ్బంది పెట్టొద్దు

● మహబూబ్‌నగర్ ఎంపీ డీకే అరుణ

మహబూబ్ నగర్ క్లాక్‌టవర్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): రైతు పండించిన ధాన్యంలో తాలు ఉంది, తేమశాతం ఎక్కువగా ఉంది, ధాన్యంలో మట్టి పెళ్లలు ఉన్నాయన్న నెపంతో ఇబ్బందికి గురి చేయొద్దని బీజేపీ జాతీయ ఉపాధ్యక్షురాలు, మహబూబ్‌నగర్ ఎంపీ డీకే అరుణ అన్నారు. పార్టీ జిల్లా కార్యలయంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. వరి కొనుగోలు కేంద్రాల్లో రైతులు పడిగాపులు కాస్తున్నారని, తాలు, తేమ, ఇతరత్ర అంక్షలు పెట్టి వారిని ఇబ్బంది పెట్టొదన్నారు. తమ పరిశీలనలో నాణ్యమైన ధాన్యానికి కూడా మిల్లర్లు కొర్రీలు పెడతూ వెనక్కు పంపుతున్నట్లు తెలిసిందన్నారు. ఏయే కేంద్రాలు ఏ మిల్లులకు కేటాయించారో ఆ మిల్లరే నేరుగా వచ్చి ధాన్యం తీసుకెళ్తే ఇబ్బందులు ఉండవన్నారు. తరుగు పేరుతో క్వింటాలుకు రెండున్నర కిలోలు తగ్గించినప్పటికీ మిల్లర్లు రైతులను ఇబ్బంది పెట్టడం సరికాదన్నారు. ఈ విషయమై కలెక్టర్లు దృష్టి సారించాలని కోరారు. 500 బోనస్ ఏ ఒక్క రైతుకూ ఇవ్వలేదన్నారు. సన్న, దొడ్డు రకం అన్న తేడా లేకుండా ఎన్నికల ముందు చేసిన వాగ్దానం మేరకు రైతు పండించిన అన్ని రకాల ధాన్యానికి రూ.500 బోనస్ ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కొనుగోలు కేంద్రాల్లో సంచుల కొరత లేకుండా చూడాలన్నారు. తెలంగాణ రాష్ట్రంలో ఎన్నికల ముందు ప్రజలకిచ్చిన ఆరు గ్యారెంటీలను అమలు చేశామని, రూ.రెండు లక్షలు రైతు రుణమాఫీ చేశామని సీఎం ఇతర రాష్ట్రాలకు పోయి చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. మీ 11 నెలల పాలనలో ఏ ఒక్కరికైన కొత్త పించన్ ఇచ్చారా? అని ప్రశ్నించారు. రూ.2,000 పింఛన్ రూ.4,000లకు పెంపు, గృహలక్ష్మి పథకం కింద రూ.ఐదు లక్షలు ఒక్కరికైనా ఇచ్చారా? అని అడిగారు. పాడి రైతులకు బిల్లులు చెల్లించడంలో జాప్యం ఏందుకని అన్నారు. వారు రోడ్డెక్కి ధర్నాలు చేయడం ప్రభుత్వానికి సిగ్గు చేటని దుయ్యబట్టారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కూడా కేసీఆర్ మాదిరిగానే వ్యవహరిస్తున్నరని ఎద్దేవా చేశారు. రాష్ట్ర అభివృద్ధికి నిధుల విషయంలో కేంద్రం ఏనాడూ జాప్యం చేయలేదన్నారు. ఆ పేరుతో నిధులు మళ్లింపు జరిగితే ఊరుకునేది లేదని స్పష్టం చేశారు. అభివృద్ధికి బీజేపీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందన్నారు. సమావేశంలో ఖైరతాబాద్ మాజీ ఎమ్మెల్యే చింతల రామచెంద్రా రెడ్డి, రాష్ట్ర క్రమశిక్షణ కమిటీ సభ్యులు నాగురావు నామాజీ, జిల్లా అధ్యక్షుడు పి.శ్రీనివాస్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి రమేశ్ కుమార్ పాల్గొన్నారు.

క్రీడా స్ఫూర్తిని అలవరుచుకోవాలి

జడ్చర్ల, ఆంధ్రజ్యోతి : విద్యార్థులు క్రీడా స్ఫూర్తిని అలవరుచుకోవాలని మహబూబ్‌నగర్ ఎంపీ, బీజేపీ జాతీయ ఉపాధ్యక్షురాలు డీకే అరుణ అన్నారు. మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్ల మండలంలోని చిట్టబోయిన్‌పల్లి సాంఘిక, సంక్షేమ బాలికల రెసిడెన్షియల్ పాఠశాలలో సోమవారం నిర్వహించిన 10వ జోనల్ స్థాయి స్పోర్ట్స్ మీట్‌కు ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. జ్యోతి ప్రజ్వలన చేసి పోటీలను ప్రారంభించారు. వివిధ పాఠశాలలకు చెందిన 680 మంది విద్యార్థులు పోటీలకు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ క్రీడల్లో గెలుపు ఓటములు సహజమన్నారు. విద్యార్థి దశ ఎన్నటికీ మరచిపోలేనిదని, పాఠశాల జీవితంలో జరిగిన విషయాలన్నీ తీపి జ్ఞాపకాలుగా నిలిచిపోతాయన్నారు. గురుకుల పాఠశాలల్లోని సౌకర్యాలను సద్వినియోగం చేసుకుని ఉన్నత స్థానాలకు ఎదగాలన్నారు. గ్రామీణ స్థాయి క్రీడాకారులను ప్రోత్సహించేందుకు ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ఖేలో ఇండియా కార్యక్రమాన్ని ప్రారంభించారని తెలిపారు. అలాగే సర్వీస్ చేసి వాలీబాల్ పోటీలను ప్రారంభించారు. అంతకు ముందు ఆమె క్రీడాకారుల గౌరవ వందనాన్ని స్వీకరించారు. కార్యక్రమంలో సాంఘిక సంక్షేమ గురుకులాల రాష్ట్ర డిప్యూటీ సెక్రటరీ రాజేశ్వరి, ప్రధానోపాధ్యాయురాలు అనిత పాల్గొన్నారు.

కాసులిస్తే కోరుకున్న చోటుకు

● మహబూబ్‌నగర్ జిల్లా విద్యాశాఖలో అక్రమ డిప్యుటేషన్లు
● రూ.50 వేల నుంచి రూ.లక్ష తీసుకుని తతంగం
● జిల్లాలో 193 మంది ఉపాధ్యాయులకు డిప్యుటేషన్
● గత ఇన్‌చార్జి డీఈవోకు కాసుల పంట

మహబూబ్‌నగర్ విద్యావిభాగం, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): మహబూబ్‌నగర్ జిల్లా విద్యాశాఖలో నిబంధలను ఉల్లంఘించి, జీవోలను పక్కన పెట్టి, ఉన్నతాధికారుల ఆదేశాలు లేకుండా ఉపాధ్యాయులకు ఇష్టం వచ్చినట్లు డిప్యుటేషన్లు ఇచ్చారు. మొన్నటి వరకు ఇన్‌చార్జి డీఈవోగా పని చేసిన రవీందర్ ఒక్కో ప్లేస్‌కు ఒక్కో రేట్ తీసుకుని, డిప్యుటేషన్ ఇచ్చినట్లు ఆరోణలు వస్తున్నాయి. విద్యార్థుల అవసరం మేరకు పాఠశాలలో ఉపాధ్యాయుల కొరత ఉంటే, అక్కడ ఏ సబ్జెక్టు టీచర్ అవసరం ఉంది?, ఎవరిని పంపించాలి? అని జిల్లా బాస్ అనుమతి తీసుకుని సర్దుబాటు చేయాలి. కానీ మహబూబ్ నగర్ జిల్లాలో నిబంధనలకు విరుద్ధంగా, ఉపాధ్యాయుల సౌకర్యం కోసం డిప్యుటేషన్లు ఇచ్చారు. జిల్లాలో మొత్తం 193 మంది డిప్యుటేషన్‌పై పని చేస్తున్నట్లు విద్యాశాఖ లెక్కలు చెబుతున్నాయి. ఇందులో ఎవరికీ డిప్యుటేషన్ ఇస్తున్నట్లు ఆదేశాలు లేవు. మౌకిక ఆదేశాల ప్రకారమే కొనసాగుతున్నారు.

డబ్బులు తీసుకుని..

మండల స్థాయిలో స్కూల్ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు సమావేశమై, ఎక్కడైనా విద్యార్థుల సంఖ్యకు ఉపాధ్యాయులు తక్కువగా ఉంటే.. ఉపాధ్యాయులు ఎక్కువగా ఉన్న చోట నుంచి సర్దుబాటు చేసుకోవచ్చని రాష్ట్ర పాఠశాల విద్యాశాఖ అధికారులు తెలిపారు. అందుకు కలెక్టర్ అనుమ తీసుకోవాలని చెప్పారు. కాని జిల్లాలో మాత్రం స్కూల్ కాంప్లెక్స్ పరిధి దాటి ఉపాధ్యాయులకు డిప్యుటేషన్ ఇచ్చారు. తద్వారా ఇన్‌చార్జి డీఈవోకు కాసుల పంట పండిందని ఆరోపణలు వస్తున్నాయి. మహబూబ్ నగర్ అర్బన్ మండలంలో జడ్చర్ల, మిడ్జిల్ మండలాల్లో పని చేసే ఉపాధ్యాయులకు డిప్యుటేషన్ ఇచ్చారు. అందుకు ఇన్‌చార్జి డీఈవోకు రూ.50 వేల నుంచి రూ.లక్ష వరకు ముట్టజెప్పినట్లు సమాచారం.

ఎంఈవో వద్దకు పంచాయితీ..

మహబూబ్‌నగర్ అర్బన్ మండల పరిధిలో పనిచేసే ఓ ఉపాధ్యాయుడి అక్కడికి డిప్యుటేషన్‌పై వచ్చారు. ఆ పాఠశాలలో అవసం లేకున్నా ఇన్‌చార్జి డీఈవో మౌకిక ఆదేశాలతో ఆయన్ను చేర్చుకున్నారు. ఇన్‌చార్జి డీఈవో ఏసీబీకి పట్టుబడటంతో డిప్యుటేషన్‌పై వచ్చిన సదరు ఉపాధ్యాయుడిని పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సొంత స్కూల్‌కు వెళ్లాలని చెప్పారు. ఈ పంచాయితీ కాస్త మండల విద్యాశాఖ అధికారి వద్దకు చేరింది. ఎంఈవో కూడా డిప్యుటేషన్ పొందిన ఉపాధ్యాయుడిని సొంత పాఠశాలలోనే పని చేయాలని ఆదేశించారు. ఈ డిప్యుటేషన్‌పై పలువురు ఎంఈవోలను 'ఆంధ్రజ్యోతి' సంప్రదించగా తాము బాధ్యతలు తీసుకోకముందే డిప్యుటేషన్ ఇచ్చారని తెలిపారు. దీనిపై డీఈవో కార్యలయ ఏడీ అనసూయను 'ఆంధ్రజ్యోతి' ఫోన్ ద్వారా వివరణ కోరగా డిప్యుటేషన్లకు సంబంధించి తమ దగ్గర ఎలాంటి సమాచం లేదని తెలిపారు.

అక్రమ డిప్యుటేషన్స్ మచ్చుకు కొన్ని..

● గండీడ్ మండల పరిధిలోని పగిడ్యాల్ తండాలో పనిచేస్తున్న ఓ టీచర్‌కు హన్వాడ మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాలకు డిప్యుటేషన్ ఇచ్చారు.
● జడ్చర్ల మండల పరిధిలోని ఎంపీపీఎస్ చంద్రు తండాలో పనిచేసే ఉపాధ్యాయుడిని మహబూబ్‌నగర్ మండల పరిధిలోని ఎంపీపీఎస్ అంబటిపల్లికి డిప్యుటేషన్ ఇచ్చారు.
● జడ్చర్ల మండల పరిధిలోని ఎంపీపీఎస్ వల్లూర్‌లో పని చేసే ఉపాధ్యాయుడిని మహబూబ్‌నగర్ అర్బన్ మండల పరిధిలోని ఎంపీపీఎస్ ఎర్రవల్లి తండాకు డిప్యుటేషన్ ఇచ్చారు.
● హన్వాడ మండలంలో పనిచేసే ఇద్దరు ఉపాధ్యాయులకు మహబూబ్‌నగర్ మండలలోని పాఠశాలకు డిప్యుటేషన్ ఇచ్చారు.
● మహబూబ్‌నగర్ మండలంలో కూడా 13 మందికి డిప్యుటేషన్లు ఇచ్చినట్లు ఎంఈవో లక్ష్మణ్‌సింగ్ 'ఆంధ్రజ్యోతి'కి తెలిపారు.



మహబూబ్‌నగర్‌లో పూలతో అలంకరించిన శిలింగం

శివాలయాలకు భక్తుల తాకిడి

మహబూబ్‌నగర్ న్యూటౌన్, నవంబరు 11: కార్తీక సోమవారం సందర్భంగా మహబూబ్‌నగర్ పట్టణంలోని శివాలయాలు భక్తులతో కిటకిటాలడాయి. వీరన్నపేటలోని పెద్దశివాలయం, బండమీదిపల్లిలోని శివాలయాలకు భక్తులు అధిక సంఖ్యలో వచ్చి, దర్శించుకున్నారు. సమీపంలో విద్యా సంస్థలు ఉండడంతో బండమీదిపల్లి శివాలయానికి అధికంగా వచ్చారు. సాయంత్రం ఆలయాల వద్ద దీపాలు వెలిగించేందుకు భక్తులు తరలొచ్చారు. ఈ సందర్భంగా భక్తులకు తీర్థ ప్రసాదాలు అందించారు.

యాదవ భవన్‌ను పరిశీలించిన ఎమ్మెల్యే



కోటకదిరలో యాదవ సంఘం భవనాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి

మహబుబ్‌నగర్ రూరల్, నవంబరు 11: మహబూబ్‌నగర్ రూరల్ మండలం కోటకదిర గ్రామంలోని యాదవ భవన్‌ను ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మల్లు నర్సింహ రెడ్డి, నాయకులు ఎన్‌పీ వెంకటేష్‌లతో సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా యాదవులు, సంఘం నాయకులు ఎమ్మెల్యేను ఘనంగా సన్మానించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ యాదవ సంఘం భవనం ప్రహరీ నిర్మానికి నిధులు ఇస్తానని హామీ ఇచ్చారు. ఫర్నీచర్‌ను కూడా సమకురుస్తామని మల్లు నర్సింహరెడ్డి చెప్పారు. కార్యక్రమంలో మండల నాయకులు శ్రీనువాస్ యాదవ్, గోవింద్ యాదవ్, యాదవ సంఘం సభ్యులు పాల్గొన్నారు.

మద్దూర్‌లో ఫుడ్ ఇన్‌స్పెక్టర్ ఆకస్మిక తనిఖీలు

మదూర్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): నారాయణపేట జిల్లా మద్దూర్ పట్టణంలోని పలు ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లు, బేకరీలను జిల్లా ఫుడ్ ఇన్‌స్పెక్టర్ నీలిమ సోమవారం ఆకస్మిక తనఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయా చోట్ల కిచెన్‌లలో సామగ్రిని పరిశీలించారు. తయారుచేసిన కేక్ ఐటమ్‌లను పరిశీలించారు. అలాగే విక్రయానికి సిద్ధంగా ఉంచిన వివిధ రకాల ఐటమ్‌ల శాంపిల్‌ను సేకరించారు. ప్యాకెట్ ఐటెం తయారు, వాడకం గడువు తేదీలను పరిశీలించారు. సేకరించిన వాటిని ల్యాబ్‌కు పంపించి వచ్చే రిపోర్టు ఆధారంగా యజమానులపై చర్యలు తీసుకుంటామని ఆమె పేర్కొన్నారు.



గుంతలమయంగా మారిన చిత్తనూర్ వెళ్లే రోడ్డు

గుంతలమయంగా రోడ్డు

మరికల్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): నారాయణపేట జిల్లా మరికల్ మండలం చిత్తనూర్ స్టేజీ నుంచి గ్రామానికి వెళ్లే రహదారి భారీ వర్షాలకు గుంతలమయంగా మారింది. ప్రస్తుతం రోడ్డుపై అడుగు తీసి అడుగు వేయలేని దుస్థితి ఏర్పడింది. నిత్యం మండల కేంద్రానికి, జిల్లా కేంద్రానికి అనేకమంది ద్విచక్ర వాహదారులు ఈ దారి మీదుగా రాకపోకలు కొనసాగిస్తున్నారు. వర్షాకాలంలో గుంతలు కన్పించక కిందపడి గాయాలపాలయ్యారు. రాత్రివేళ అత్యవసర పరిస్థితుల్లో ఎవరినైనా ఆసుపత్రికి తరలించాలంటే ఆటో డ్రైవర్లు ఇబ్బందులకు గురవుతున్నారు. ఎమ్మెల్యే, ఉన్నతాధికారులు స్పందించి బీటీ రోడ్డుకు నిధులు మంజూరు చేసి రోడ్డు వేయాలని గ్రామస్థులు కోరుతున్నారు.

వికారాబాద్ కలెక్టర్‌పై దాడి తగదు

టీఎన్‌జీవోస్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు జి.రాజీవ్‌రెడ్డి, ఆర్.చంద్రానాయక్

పాలమూరు, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): విధి నిర్వహణలో ఉన్న వికారాబాద్ కలెక్టర్ ప్రతీక్‌జైన్ ఐఏఎస్‌పై, అలాగే కొడంగల్ డెవలప్‌మెంట్ అథారిటీ ప్రత్యేక అధికారి వెంకట్‌రెడ్డిపై దాడి చేయటం సరికాదని టీఎన్‌జీవోస్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు జి.రాజీవ్‌రెడ్డి, ఆర్.చంద్రానాయక్ సోమవారం ఒక ప్రకటనలో ఖండించారు. దోషులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని, ఉద్యోగులు ప్రజాసేవలో ఉన్నప్పుడు ప్రభుత్వమే వారికి రక్షణ కల్పించాలని పేర్కొన్నారు. శ్యాంసుందర్‌రెడ్డి, డా.కృష్ణమోహన్, వెంకట్రామిరెడ్డి, నందకిషోర్, యుగంధర్ నాయుడు, కృష్ణకాంత్, మహేశ్వర్‌రెడ్డి, కృష్ణకుమార్‌గౌడ్, దేవేందర్, లక్ష్మీనారాయణ, తిరుపతయ్య దాడిని ఖండించిన వారిలో ఉన్నారు.



ఆలయ ప్రాంగణంలో వ్రతాలు చేస్తున్న భక్తులు

ఆలయాలకు కార్తీక శోభ

- ఉమామహేశ్వరంలో పార్వతీ పరమేశ్వరుల పల్లకీ సేవ
- అలంపూరులో కార్తీక దీపాలను వెలిగించిన భక్తులు

అచ్చంపేట/బిజినేపల్లి, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): కార్తీక మాసం రెండో సోమవారం సందర్భంగా భక్తులు వేకువజాము నుంచే ఉమామహేశ్వరుడిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ప్రాంగణంలో మహిళలు పెద్ద ఎత్తున కార్తీక దీపాలను వెలిగించారు. ఈ సందర్భంగా ఆలయ మండపంలో వ్రతాలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. సాయంత్రం పార్వతీపరమేశ్వరుల పల్లకీ సేవ పాపనాశిని నుంచి ఆలయం వరకు ఉన్న మాడవీధులలో బాజా భజంత్రీలతో ఊరేగింపు నిర్వహించారు. కార్తీక మాసం సందర్భంగా భక్తులకు ఇబ్బందులు లేకుండా ఆలయ కమిటీ చైర్మన్ బీరం మాధవరెడ్డి, ఈవో శ్రీనివాసరావు తోపాటు ఆలయ సిబ్బంది ధర్మకర్తలిమండలి సభ్యులు పవన్, వినోద్ లు ప్రత్యేక ఏర్పాట్లును పర్యవేక్షించారు. నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రానికి చెందిన సుదర్శన్ గురుస్వామి ఆధ్వర్యంలో ఆలయ ప్రాగణంలో 30మంది అయ్యప్ప మాలలు ధరించారు. ఆలయ ప్రాగణంలో ఆలయ అధ్యక్షుడు లక్షదీపోత్సవాన్ని వెలిగించారు. కార్యక్రమంలో అర్చకులు వీరయ్య, రవికుమార్, సిబ్బంది లక్ష్మణ్, కవికుమార్, తదితరులు పాల్గొన్నారు.



పాలెంలో జరిగిన కల్యాణోత్సవంలో అలివేలు మంగ, వేంకటేశ్వరస్వామి ఉత్సవ మూర్తులు

అలివేలు మంగ సమేత వేంకటేశ్వరస్వామి కల్యాణోత్సవం కనుల పండువగా సాగింది. నాగర్‌కర్నూల్ జిల్లా బిజినేపల్లి మండలంలోని పాలెం వేంకటేశ్వర స్వామి ఆలయంలో సోమవారం స్వామి, అమ్మవార్ల ఉత్సవమూర్తులను పట్టు వస్త్రాలతో అలకరించి కల్యాణోత్సవం నిర్వహించారు. అనంతరం స్వామి వారి కల్యాణోత్సవానికి హాజరైన భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో ఆలయ ప్రధాన అర్చకుడు రామానుజచార్యులు, ఆలయ ఈవో సీహెచ్ రంగారావు, అర్చకులు, జయంత్, చక్రపాణి, శుక్లా, ఆలయ సిబ్బంది శివకుమార్, బాబయ్య, శ్రీదేవి, కే శ్రీహరి, అంజనమ్మ తదితరులు ఉన్నారు.

అన్నదాతల పడిగాపులు

● ధాన్యం సేకరణలో ఆలస్యం
● కేంద్రాల వద్ద నిలిచిన వరి
● ఇబ్బందుల్లో అన్నదాతలు



మూలమల్ల గ్రామంలో ఆరబెట్టిన వరి ధాన్యాన్ని కొనుగోలు చేయకపోవడంతో కప్పి ఉంచిన రైతులు

వనపర్తి అర్బన్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో వరి కోతలు ముమ్మరంగా సాగుతున్నాయి. 15 రోజుల నుంచి వరి కోతలు ముమ్మరంగా సాగుతుండటంతో కొనుగోలు కేంద్రాలకు ధాన్యం పోటెత్తుతోంది. కానీ ఆ స్థాయిలో ధాన్యం సేకరణ ప్రారంభం కాలేదు. జిల్లా వ్యాప్తంగా 379 కొనుగోలు కేంద్రాలు ప్రారంభించాల్సి ఉండగా ఇప్పటి వరకు 183 మాత్రమే ప్రారంభించారు. ఈ సీజన్‌లో సుమారు నాలుగు లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణ చేయాలని పౌరసరఫరాలశాఖ అధికారులు లక్ష్యంగా పెట్టుకున్నారు. రైతులు కూడా వరి కోతలు ప్రారంభించి ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తీసుకువస్తున్నారు. కొనుగోలు కేంద్రాలు ఆలస్యం అవుతుండడంతో కొనుగోలు కేంద్రాలకు తీసుకువచ్చిన ధాన్యాన్ని కాపాడుకోవడానికి రైతులు నానా తంటాలు పడుతున్నారు.

కేంద్రాల వద్దే పడిగాపులు

జిల్లా వ్యాప్తంగా కొనుగోలు కేంద్రాలకు ధాన్యం తీసుకువచ్చి 20 రోజులు అవుతున్నా కొన్ని ప్రాంతాలలో ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభించలేదు. దీంతో రైతులు ప్రతీరోజు ధాన్యం కుప్పల వద్ద పడిగాపులు కాస్తున్నారు. ధాన్యం కొనుగోలు చేయాలని వేడుకుంటున్నా ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలు వస్తే గానీ కొనుగోలు కేంద్రాలు ప్రారంభించలేమని సమాధానం ఇస్తున్నట్లు రైతులు ఆరోపిస్తున్నారు. రోజు రోజుకు ఆలస్యం కావడం వలన వర్షం కురిస్తే ఆరుగాలం చేసిన కష్టం నీటి పాలవుతుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

బ్యాంకు గ్యారెంటీనే ప్రధాన సమస్య..!

జిల్లా వ్యాప్తంగా మొత్తం 173 రైస్ మిల్లులు ఉండగా అందులో 12 బాయిల్డ్ మిల్లులు ఉన్నాయి. ఇందులో ఇప్పటి వరకు డిఫాల్టర్ అయినవి 120 ఉన్నాయి. మిగతా మిల్లులకు ధాన్యం కేటాయించాల్సి ఉంటుంది. వీరందరూ బ్యాంకు గ్యారెంటీ ఇవ్వగానే ధాన్యం కేటాయించనున్నట్లు పౌరసరఫరాల శాఖ అధికారుల నుంచి సమాచారం. ఇప్పటి వరకు జిల్లాలో బ్యాంకు గ్యారెంటీ ఇవ్వడానికి ఒక్క మిల్లర్ కూడా ముందుకు రాలేదు. దీంతో ధాన్యం సేకరణతో పాటు కేంద్రాలను ప్రారంభించడం ఆలస్యమవుతోందని పలువురు ఆరోపిస్తున్నారు. ఇప్పటి వరకు జిల్లాలో 57వేల మంది రైతుల నుంచి 469 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని సేకరించినట్లు సమాచారం.

పది రోజులైనా కాంట చేయలే..



కొనుగోలు కేంద్రానికి ధాన్యం తీసుకువచ్చి పది రోజులు అవుతోంది. ధాన్యం తీసుకువచ్చినప్పటి నుంచి ప్రతీ రోజు ఇక్కడే ఉంటున్నాం. ఇప్పటి వరకు కొనుగోలు కేంద్రం కూడా ప్రారంభించలేదు. నిర్వాహకులను అడిగితే అధికారుల నుంచి ఆదేశాలు వస్తేనే కొనుగోలు చేస్తామని చెబుతున్నారు. త్వరగా కొనుగోలు చేయాలి.

- శివ, గోపాల్‌పేట

ధాన్యం కొనడం లేదు



మూలమల్లలో మూడు రోజుల క్రితం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. కానీ ఇప్పటి వరకు ధాన్యం కొనుగోలు చేయలేదు. ఇదేంటని అడిగితే తేమ శాతం గుర్తించే యంత్రం, దొడ్డు, సన్న ధాన్యాన్ని గుర్తించే యంత్రాలు రాలేదని, అవి రాగానే కొనుగోలు చేస్తామని చెబుతున్నారు. కొనుగోలు చేయకపోవడంతో రాత్రింబవళ్లు కేంద్రాల్లోనే ధాన్యానికి కాపలా ఉంటున్నాం.

- రాములు, రైతు మూలమల్ల

కేంద్రాల వద్ద పరికరాల కొరత లేదు

కొనుగోలు కేంద్రాల వద్ద పరిక రాల కొరత లేదు. 75 శాతం ఇప్ప టికే పంపిణీ చేశాం. నూర్పిడి, మాల్ వెయింగ్ మిషన్, ముద్ర పరికరాలకు సంబంధించి కొరత ఉందనేది అవాస్తవం. ఎక్కడైనా సమస్య ఉన్న మా దృష్టికి తీసుకువస్తే వెంటనే పరిష్క రించేందుకు చర్యలు తీసుకుంటాం.

- స్వరణ్ సింగ్, జిల్లా మార్కెటింగ్ అధికారి

నగదు చెల్లింపులు జరగాలి

వనపర్తి రాజీవ్‌చౌరస్తా, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి) : రైతుల నుంచి వరి ధాన్యం కొనుగోలు చేసిన తరువాత వారికి వేగంగా నగదు చెల్లింపులు జరిగేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదర్శ్ సురభి ఆదేశించారు. ధాన్యం కొనుగోళ్ల అంశంపై అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వెంకటేశ్వర్లుతో కలిసి సమీక్షించారు. కొనుగోలు కేంద్రాల్లో తప్పనిసరిగా ఫ్యాన్లు, గన్ని బ్యాగులు, టార్పాలిన్లు అందుబాటులో ఉంచాలని సూచించారు. డేటా నమోదు వేగంగా జరగాలన్నారు. అనంతరం విద్యావేత్త, స్వాతంత్ర్య సమరయోధుడు డాక్టర్ మౌలానా అబుల్ కలాం ఆజాద్ జీవితం అందరికీ ఆదర్శమని కలెక్టర్ ఆదర్శ్ సురభి అన్నారు. ఆయన జయంతి సందర్భంగా సోమవారం ఆజాద్ చిత్రపటానికి కలెక్టర్ పూలమాల వేసి నివాళి అర్పించారు.

పొగాకు ఉత్పత్తుల వాడకంతో ఆరోగ్యానికి ప్రమాదం



బిజినేపల్లి బస్టాండ్‌లో ప్రజలకు అవగాహన కల్పిస్తున్న కళాకారులు

బిజినేపల్లి, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి) : పొగాకు ఉత్పత్తుల వాడకం ద్వారా ఆరోగ్యానికి ప్రమాదమని పాటల ద్వారా కళాజాతా బృందం ప్రజలకు అవగాహ కల్పించింది. మండల కేంద్రంలోని ఆర్టీసీ బస్టాండ్‌లో సోమవారం జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ఆదేశానుసారం జాతీయ పొగాకు నివారణ కార్యక్రమంలో భాగంగా కళాజాతా బృందంచే పొగాకు నమలడం, తాగడం, వేరేవిధంగా తీసుకున్న కలిగే నష్టాలను ఆట పాటల ద్వారా వివరించారు. వైద్య, ఆరోగ్యశాఖ విస్తరణ అధికారి పి.రమేష్, సిబ్బంది తామర, ఆశోక్, గంగ, కళాజాత బృందం రేలారే శివ నాగులు, డప్పు నరేందర్, శివ, సికిందర్, భాస్కర్, జల్లి కృష్ణ, పార్వతమ్మ అస్మా, రేణుక తదితరులు ఉన్నారు.

బాల కార్మికుడి అదృశ్యం కేసు నమోదు

నాగర్‌కర్నూల్ క్రైం, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): బాల కార్మికుడు అదృశ్యం కావడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ గోవర్ధన్ సోమవారం తెలిపారు. వివరాల ప్రకారం.. అచ్చంపేట నియోజకవర్గంలో ఒక వ్యక్తి దగ్గర పని చేస్తుండగా బాలభవన్ అధికారులు నవంబరు 7న ఆ బాలుడి తల్లిదండ్రులను పిలిపించి కౌన్సెలింగ్ ఇప్పించాలని ఆలోచనతో బాలకార్మికుల్ని అనాథ ఆశ్రమంలో ఉంచారు. ఈ నెల 9న బాల కార్మికుడు ఎవరికీ చెప్పకుండా అక్కడి నుంచి పారిపోయాడు. చుట్టు పక్కల తెలిసిన ప్రాంతాల్లో వెతికినా ఆచూకీ లభించకపోవడంతో ఆశ్రమ నిర్వాహకుడు భూపాల్‌రెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

శ్రీశైలం ముంపు నిర్వాసితులకు ఉద్యోగాలివ్వాలి

నాగర్‌కర్నూల్ టౌన్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): శ్రీశైలం ముంపు నిర్వాసితులకు జీవో నెంబరు 98, 68 ప్రకారం ఉద్యోగాలు కల్పించాలని బాధితులు సోమవారం కలెక్టరేట్ ప్రజావాణిలో వినతి పత్రం అందజేశారు. ప్రభుత్వం ప్రకటించిన మెమోలో జిల్లాకు 25 మంది హెల్పర్లు, 25 మంది లస్కర్ పోస్టులు కేటాయించారని పేర్కొన్నారు. కలెక్టర్ స్పందించి శ్రీశైలం ముంపు బాధితులకు ఉద్యోగాల అవకాశాలు కల్పించి ఆదుకోవాలని వారు కోరారు. శ్రీశైలం ముంపు బాధితులు గోవిందు, డాగోజీరావు, నాగేశ్వర్, భూపాల్, బాలయ్య, షబ్బీర్ పాల్గొన్నారు.

పీజీ కేంద్రంలో సౌకర్యాలు కల్పించాలి

గద్వాల టౌన్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని పీజీ కేంద్రంలో అకాడమిక్ బిల్డింగ్‌ను సత్వరం ప్రారంభించి పూర్తిస్థాయి సౌకర్యాలు కల్పించాలని బీఆర్‌ఎస్వీ జిల్లా కో ఆర్డినేటర్ పల్లయ్య కోరారు. ఇప్పటికే నిర్మాణం పూర్తయిన బాస్కెట్‌బాల్ కోర్టును వినియోగంలోకి తేవాలన్నారు. సోమవారం పీజీ కేంద్రం వద్ద బీఆర్‌ఎస్వీ విస్తృతస్థాయి సమావేశం నిర్వహించారు. కేంద్రంలో ఎదురవుతున్న ఇబ్బందులు, సమస్యలపై చర్చించి తదితర సమస్యలు పరిష్కరించాలని ప్రిన్సిపాల్ వెంకట్‌రెడ్డికి వినతిపత్రం ఇచ్చారు. గద్వాల పీజీ కేంద్రం కమిటీని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అధ్యక్షుడిగా ఓంకార్, ప్రధాన కార్యదర్శిగా హరి కృష్ణ, మెస్ ఇన్‌చార్జిగా దివ్య భారతి, సెక్రటరీగా బాలు, జాయింట్ సెక్రటరీలుగా రాజశేఖర్, వీరేష్, శ్రీను, ఆదిల్, హరీష్, జోయల్‌ను ఎన్నుకుట్లు తెలిపారు.

స్పోర్ట్స్ బాక్స్

క్రీడా రంగానికి ప్రభుత్వం పెద్దపీట

» అచ్చంపేట ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ



ఒలింపిక్ కాగడాతో ఎమ్మెల్యే వంశీకృష్ణ

లింగాల, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి) : క్రీడా రంగానికి రాష్ట్ర ప్రభుత్వ పెద్దపీట వేస్తోందని క్రీడాకారుల ఉన్నతికి చేయూతనిస్తోందని అచ్చంపేట శాసన సభ్యుడు డాక్టర్ వంశీకృష్ణ అన్నారు. నాగర్‌కర్నూల్ జిల్లా లింగాల సాంఘిక సంక్షేమ గురుకుల కళాశాల క్రీడా మైదానంలో సోమవారం ప్రారంభమైన పదవ జోనల్ క్రీడా పోటీలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. పోటీల్లో పాల్గొనేందుకు 13 గురుకుల పాఠశాలలు, కళాశాలల నుంచి 1,105 మంది విద్యార్థులు తరలివచ్చారు. క్రీడాకారుల గౌరవ వందనాన్ని స్వీకరించిన అనంతరం ఎమ్మెల్యే వంశీకృష్ణ క్రీడా జ్యోతిని వెలిగించి పోటీలను ప్రారంభించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ బాలస్వామి, జోనల్ స్పోర్ట్స్ కో ఆర్డినేటర్ పీడీ వెంకటేశ్వర్లు, ఆర్గనైజింగ్ సెక్రటరీ పీడీ ఆదిబాబు, పీఈటీ నారాయణ, నాయకులు నారాయణగౌడ్, నాగేశ్వర్‌రావు, శ్రీనివాస్ రాథోడ్, పూజారి వెంకటయ్య, ఉల్లంగొండ్ల రాజు, ఇందిర, విజయలక్ష్మి పాల్గొన్నారు.

క్రీడల్లో రాణించి ఉన్నత స్థాయికి ఎదగాలి

» ప్రణాళికా సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డి



క్రీడా పోటీలను ప్రారంభిస్తున్న చిన్నారెడ్డి

గోపాల్‌పేట, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి) : యువతులు చదువుతో పాటు క్రీడల్లో రాణించి, ఉన్నత స్థాయికి ఎదగాలని రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు జిల్లెల చిన్నారెడ్డి అన్నారు. వనపర్తి జిల్లా గోపాల్‌పేట మండలంలోని బుద్దారం గురుకుల పాఠశాలలో సోమవారం నిర్వహించిన క్రీడా పోటీలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యాభివృద్ధితో పాటు ఉద్యోగ ఉపాధి కల్పనపై కాంగ్రెస్ ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటోందన్నారు. పాఠశాలకు సోలార్ ఫెన్సింగ్ ఏర్పాటు చేయిస్తామని, విద్యార్థుల సౌకర్యార్థం మరో ఐదు ఎకరాల భూమిని కేటాయిస్తామని హామీ ఇచ్చారు. అనంతరం జ్యోతిని వెలిగించి పోటీలను ప్రారంభించి, క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. పోటీల్లో 11 గురుకుల పాఠశాలలకు చెందిన విద్యార్థులు పాల్గొంటున్నారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీనివాస్‌గౌడ్, సింగిల్ విండో చైర్మన్ లోడె రఘు, మండల ఇన్‌చార్జి సత్యశీలారెడ్డి, ప్రిన్సిపాల్ ఆరోగ్యం, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక కావాలి

» జిల్లా ఒలింపిక్ సంఘం అధ్యక్షుడు ఎన్‌పీ వెంకటేశ్



పతకాలు సాధించిన విద్యార్థులతో ఎన్‌పీ వెంకటేశ్, కురుమూర్తి గౌడ్, షకీల్, తాజుద్దీన్, ఇలియాజ్, అశ్వాక్

మహబూబ్‌నగర్ స్పోర్ట్స్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి) : జిల్లా క్రీడాకారులు పోటీల్లో రాణించి, జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక కావాలని ఒలింపిక్ సంఘం జిల్లా అధ్యక్షుడు ఎన్‌పీ వెంకటేశ్ అన్నారు. రంగారెడ్డి జిల్లాలో ఆదివారం నిర్వహించిన సబ్ జూనియర్ ఉషూ టోర్నీలో జిల్లా క్రీడాకారులు సయ్యద్ బంగారు పతకం, శ్రీనాథ్, వంశీ, విశ్వకిరణ్ కాంస్య పతకాలు సాధించారు. పాలమూరు పట్టణంలోని స్టేడియం మైదానంలో సోమవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో క్రీడాకారులను ఎన్‌పీ వెంకటేశ్ అభినందించారు. కార్యక్రమంలో ఒలింపిక్ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కురుమూర్తిగౌడ్, ఉషూ అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు షకీల్, తాజుద్దీన్, ఉపాధ్యక్షుడు ఖాజాఖాన్, ట్రెజరర్ ఇలియాజ్, మాస్టర్ అశ్వాక్ పాల్గొన్నారు.

చదువుతో పాటు క్రీడల్లో రాణించాలి

మహబూబ్‌నగర్ స్పోర్ట్స్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి) : చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని మహబూబ్‌నగర్ పట్టణంలోని మహాత్మా గాంధీ రోడ్డు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రహీం ఫారుఖీ అన్నారు. నిర్మల్ జిల్లా కేంద్రంలో ఈ నెల ఎనిమిది నుంచి 10వ తేదీ వరకు నిర్వహించిన రాష్ట్ర స్థాయి ఎస్‌జీఎఫ్ నెట్‌బాల్ టోర్నీలో జిల్లా కేంద్రంలోని మహాత్మాగాంధీ రోడ్డు స్కూల్ విద్యార్థులు వరప్రసాద్, జునైద్ పాల్గొని ప్రతిభ చాటారు. ఈ సందర్భంగా సోమవారం పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వారిని అభినందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయుడు అత్తర్, పీడీ అరుణజ్యోతి పాల్గొన్నారు.

15న ఉమ్మడి జిల్లా బాక్సింగ్ జట్ల ఎంపికలు

» ఎస్‌జీఎఫ్ సెక్రటరీ శారదాబాయి

మహబూబ్‌నగర్ స్పోర్ట్స్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి) : జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ (ఎస్‌జీఎఫ్) ఆధ్వర్యంలో 15న ఉమ్మడి జిల్లా అండర్-14, 17 బాల, బాలికల బాక్సింగ్ జట్ల ఎంపిక పోటీలు నిర్వహించనున్నట్లు ఎస్‌జీఎఫ్ సెక్రటరీ శారదాబాయి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం తొమ్మిది గంటలకు స్టేడియం మైదానంలో ఎంపికలు ఉంటాయని పేర్కొన్నారు. బోనఫైడ్, ఆధార్‌కార్డు జిరాక్స్ పత్రాలతో రావాలని సూచించారు. అండర్-14 విభాగానికి 2008, జనవరి ఒకటి, అండర్ - 17కు 2011, జనవరి ఒకటి తరువాత పుట్టిన వారు అర్హులని పేర్కొన్నారు.

యువశక్తి.. సేవా స్ఫూర్తి

» 10 మంది సభ్యులతో ఫౌండేషన్ ఏర్పాటు » ప్రస్తుతం నాలుగు వేల మంది సభ్యులు

» అవసరమైన వారికి రక్తం అందించడమే లక్ష్యం » సామాజిక సేవలోనూ భాగస్వామ్యం

ఖిల్లాఘణపురం, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి) : వనపర్తి జిల్లా ఖిల్లాఘణపురం మండల కేంద్రానికి చెందిన కాగితాల మధు ఎమ్మెస్సీ, బీఈడీ పూర్తి చేశాడు. ఒక వైపు ఉద్యోగ అవకాశాల కోసం ప్రయత్నిస్తూనే, స్వచ్ఛందంగా విద్యాబోధన చేస్తున్నాడు. కరోనా మహమ్మారి మరో సారి విజృంభిస్తున్న సమయం.. 2021, మార్చి ఎనిమిది, అంతర్జాతీయ మహిళా దినోత్సవం రోజు హైదరాబాద్‌లో నిండు గర్భిణికి బి పాజిటివ్ రక్తం అవసరమైంది. కానీ సకాలంలో రక్తం లభించలేదు. దీంతో ఆమె జన్మనిచ్చిన శిశువు మృతి చెందింది. ఆ సమయంలో ఏదో పని మీద ఆసుపత్రికి వెళ్లిన కాగితాల మధు అక్కడే ఉన్నాడు. ఈ విషాద సంఘటన అతడి మనసును కలిచివేసింది. 'తన కోసం చేసే పనులు తనతోనే అంతరించిపోతాయి.. పది మంది కోసం చేసే పనులు పది కాలాల పాటు నిలిచిపోతాయి' అనే స్వామి వివేకానంద బోధనను స్ఫూర్తిగా తీసుకున్నాడు. యువతలో సేవా దృక్పథాన్ని పెంచడంతో పాటు, సమాజంలో మార్పు రావాలనే లక్ష్యంతో యువశక్తి ఫౌండేషన్‌ను ఏర్పాటు చేశాడు.



ఖిల్లాఘణపురంలో యువశక్తి ఫౌండేషన్ ద్వారా రక్తదానం చేస్తున్న ప్రజాప్రతినిధులు (ఫైల్)

10 మంది సభ్యులతో ప్రారంభం

మొదట 10 మంది సభ్యులతో యువశక్తి ఫౌండేషన్ ప్రారంభం అయ్యింది. వాట్సాప్ గ్రూప్ వేదికగా రాష్ట్ర వ్యాప్తంగా పలు జిల్లాలకు చెందిన నాలుగు వేల మంది సంస్థలో సభ్యులుగా చేరారు. అత్యవసర పరిస్థితుల్లో రక్తం అవసరమైన వారు ఎంత దూరంలో ఉన్నా గ్రూప్ సభ్యులు రక్తదానం చేసి ప్రాణదాతలుగా నిలుస్తున్నారు. ఇలా ఇప్పటి వరకు దాదాపు 30 వేల మందికి పైగా రక్తదానం చేశారు. అలా రక్తదానం స్వీకరించిన వారి కుటుంబ సభ్యులు మరొకరికి రక్తం ఇచ్చేలా చైతన్య పరుస్తున్నారు. ఉమ్మడి పాలమూరు జిల్లాలోనే కాకుండా, రాష్ట్ర వ్యాప్తంగా రెడ్‌క్రాస్, చిరంజీవి బ్లడ్ బ్యాంకులలో రక్తం నిల్వలు అందుబాటులో లేకపోతే యువశక్తి ఫౌండేషన్ ద్వారా సేవలు అందిస్తున్నారు. వాట్సాప్ గ్రూపుల ద్వారా సమాచారం అందిన వెంటనే ఏ సమయంలోనైనా అందుబాటులో ఉన్న గ్రూప్ సభ్యులు అక్కడికి చేరుకొని రక్తదానం చేస్తున్నారు. సభ్యులు రక్తదాన శిబిరాల్లో చురుకుగా పాల్గొంటూ, ప్రజా ప్రతినిధులు, అధికారులు సైతం రక్తదానం చేసేలా ప్రోత్సహిస్తున్నారు. అలాగే పేద విద్యార్థులకు పుస్తకాలు, పెన్నులు, ప్యాడ్లు పంపిణీ చేస్తున్నారు. ఎంబీబీఎస్, ఇంజనీరింగ్, ఉద్యోగాల కోసం శిక్షణ పొందేందుకు దాతల సహకారంతో ఆర్థిక సాయం అందించి అండగా నిలుస్తున్నారు.

రక్తదానానికి సిద్ధంగా ఉన్నాం



రాష్ట్రంలో ఎక్కడైనా రోగులకు రక్తం లభించకపోతే రాత్రి పగలు తేడా లేకుండా ఫౌండేషన్ ఆధ్వర్యంలో రక్తం అందిస్తున్నాం. ఇప్పటి వరకు నేను 60 సార్లు రక్తదానం చేశాను. యువతీ యువకులను చైతన్య పరిచి రక్తదాన శిబిరాలు ఏర్పాటు చేస్తున్నాం. సకాలంలో రక్తం అందక ఒక్కరు కూడా చనిపోవద్దనే దృఢ సంకల్పంతో పని చేస్తున్నాం.

- కాగితాల మధు, యువశక్తి ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు



రక్తదానం చేస్తున్న తండ్రీ కొడుకులు ధాన్యం ప్రవీణ్, గౌతమ్ (ఫైల్)

70 సార్లు రక్తదానం

ధాన్యం ప్రవీణ్, వనపర్తి : గర్భిణులు, క్యాన్సర్, తలసేమియా, కిడ్నీ వ్యాధి బాధితులకు రక్తం చాలా అవసరం అవుతుంది. వారి కోసం ప్రతీ మూడు నెలలకు ఒకసారి చొప్పున, ఇప్పటి వరకు 70 సార్లు రక్తదానం చేశాను. నా కుమారుడు గౌతమ్ కూడా రెండు సార్లు రక్తదానం చేశాడు. రక్తదానంతో ప్రాణదానం చేయడం సంతృప్తి కలిగించింది.

ఫౌండేషన్ సేవలు చిరస్మరణీయం



లక్ష్మి, నారాయణపేట : నేను ప్రసవం కోసం నారాయణపేట ఆసుపత్రిలో చేరిన సమయంలో రక్తం దొరకలేదు. దీంతో ఫౌండేషన్ సభ్యులు సకాలంలో స్పందించి రక్తం ఇవ్వడంతో సుఖ ప్రసవం అయ్యింది. ఒకే కాన్పులో ముగ్గురు పండంటి బిడ్డలు జన్మించారు. యువశక్తి ఫౌండేషన్ అందిస్తున్న సేవలు చిరస్మరణీయం.

ఫౌండేషన్ స్ఫూర్తితో రక్తదానం




ఉమాదేవి, వనపర్తి : మా చెల్లెలు అనారోగ్యానికి గురయ్యింది. వనపర్తి ప్రభుత్వ ఆసుపత్రిలో రక్తం దొరకక ఇబ్బంది పడుతుంటే యువశక్తి ఫౌండేషన్ సభ్యులు రక్తదానం చేసి ఆదుకున్నారు. ఆ విషయాన్ని నేను ఎప్పటికీ మరచిపోలేను. వారి స్ఫూర్తితో నేను ఇప్పటి వరకు 12 సార్లు రక్తదానం చేశాను.

జాతరలో జనం సందడి

» కురుమూర్తి క్షేత్రానికి తరలివస్తున్న ప్రజలు

» దాసంగాలు సమర్పించి మొక్కులు తీర్చుకుంటున్న భక్తులు

చిన్నచింతకుంట, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి) : మహబూబ్‌నగర్ జిల్లా, చిన్నచింతకుంట మండలం, అమ్మాపూర్ గ్రామ సమీపంలోని కురుమూర్తి క్షేత్రంలో భక్తుల రద్దీ కొనసాగుతోంది. బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఈ నెల ఎనిమిదిన ఉద్దాలోత్సవం అనంతరం జాతర ప్రారంభమైంది. వివిధ ప్రాంతాల నుంచి తరలి వస్తున్న భక్తులతో జాతర మైదానం సందడిగా మారింది. భక్తులు స్వామి వారికి దాసంగాలను సమర్పించి మొక్కులు తీర్చుకుంటున్నారు. జాతరలో ఏర్పాటు చేసిన రంగుల రాట్నాలు, సర్కస్‌లు, వాటర్ గేమ్స్ చిన్నారులను ఆకట్టుకుంటున్నాయి. వస్త్రాలు, గాజులు, స్టీల్ సామాను, ఆటబొమ్మల దుకాణాలు కొనుగోలుదారులతో కళకళలాడుతున్నాయి.



విద్యుత్ దీపాల వెలుగులో రంగుల రాట్నం



భక్తులతో కళకళలాడుతున్న జాతర మైదానం ; దాసంగాలను సిద్ధం చేస్తున్న మహిళలు; స్వామిని దర్శించుకుంటున్న భక్తులు

రైలు కింద పడి యువకుడి ఆత్మహత్య

కృష్ణ, నవంబరు, 11 (ఆంధ్రజ్యోతి) : రైలు కింద పడి ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. నారాయణపేట జిల్లా, కృష్ణ మండల పరిధిలోని కుసుమ్ గ్రామ శివారులో సోమవారం జరిగింది. రైల్వే ఎస్‌ఐ అక్బర్ తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన గోపాల్ (28) సోమవారం గుర్తు తెలియని గూడ్స్ రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ విషయంపై సమాచారం అందడంతో ఎస్‌ఐ అక్బర్ సంఘటనా స్థలానికి చేరుకొని, గోపాల్ మృతదేహాన్ని మక్తల్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు రైల్వే ఎస్‌ఐ అక్బర్ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి

తెలకపల్లి, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి) : రోడ్డు ప్రమాదంలో ఓ మహిళ మృతి చెందింది. నాగర్‌కర్నూల్ జిల్లా తెలకపల్లి మండలంలో ఆదివారం జరిగింది. ఎస్‌ఐ బి నరేశ్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మండలంలోని ఆలేరుకు చెందిన బీరగాళ్ల రాము, పుష్పలత దంపతులు ఈ నెల 10న ద్విచక్ర వాహనంపై గ్రామం నుంచి నాగర్‌కర్నూల్‌కు వెళ్లారు. సాయంత్రం తిరిగి వస్తుండగా, కమ్మరెడ్డిపల్లి గేటు వద్ద ఎదురుగా వస్తున్న మరో ద్విచక్రవాహనం ఢీకొన్నది. దీంతో తీవ్రంగా గాయపడిన పుష్పలత అక్కడికక్కడే మృతి చెందింది. రాము ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. అతడి తమ్ముడు మల్లయ్య సోమవారం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

పోక్సో కేసులో వ్యక్తికి జైలు శిక్ష

మక్తల్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి) : నారాయణపేట జిల్లా మక్తల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని గోప్లాపూర్ గ్రామానికి చెందిన గుండ్ల అశోక్ అనే వ్యక్తికి పోక్సో కేసులో జైలు శిక్ష, జరిమానా విధిస్తూ న్యాయాధికారి తీర్పు వెల్లడించారు. డీఎస్పీ లింగయ్య తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మండలంలోని ఓ గ్రామానికి చెందిన గుండ్ల అశోక్, అదే ఊరికి చెందిన బాలికను బెదిరించి లోబరుచుకున్నాడు. ఈ నేపథ్యంలో బాలిక తనకు కడుపునొప్పి వస్తుందని తల్లిదండ్రులకు చెప్పడంతో వారు ఆసుపత్రిలో వైద్య పరీక్షలు చేయించగా, ఏడవ నెల గర్భవతి అని వైద్యులు తెలిపారు. దీంతో వారు 2020, నవంబర్ 30న పోలీసులకు ఫిర్యాదు చేశారు. అప్పటి ఎస్‌ఐ రాములు కేసు నమోదు చేసుకొని విచారణ చేపట్టారు. ఈ కేసుపై నారాయణపేట జిల్లా కోర్టులో సోమవారం వాదోపవాదాలు జరిగాయి. అనంతరం నిందితుడికి 21 ఏళ్ల జైలుశిక్ష, రూ.21 వేల జరిమానా విధిస్తూ జిల్లా ప్రధాన న్యాయాధికారి అబ్దుల్ రఫీ తీర్పు ఇచ్చారు. నిందితుడికి శిక్ష పడేలా కృషి చేసిన పోలీస్ అధికారులు, ఏఎస్సై కృష్ణయ్యగౌడ్, ఎండీ కవి, భీంరాంజిలను డీఎస్పీ అభినందించారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి

అలంపూర్ చౌరస్తా, నవంబరు 11 (ఆంధ్యజ్యోతి) : జోగుళాంబ గద్వాల జిల్లా ఉండవల్లి మండల పరిధిలోని వరసిద్ధి వినాయక పత్తి మిల్లు వద్ద గుర్తు తెలియని వాహనం ఢీకొని ఓ వ్యక్తి మృతి చెందాడు. ఎస్‌ఐ మహేష్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. పుల్లూరు గ్రామానికి చెందిన మల్లెపోగు నాగరాజు (54) పత్తి మిల్లు వద్దకు వెళ్తున్నానని చెప్పి ఇంటినుంచి బయటకు వెళ్లాడు. అర్ధరాత్రి సమయంలో నడుచుకుంటూ ఇంటికి వస్తుండగా, గుర్తు తెలియని వాహనం ఢీకొని తలకు తీవ్ర గాయమై మృతి చెందాడు. ఈ మేరకు అతడి భార్య జయమ్మ ఫిర్యాదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

డబుల్ క్లైమ్ కేసులో పురోగతి

» కోర్టులో లొంగిపోయిన నిందితుడు » రిమాండ్‌కు తరలింపు

గద్వాల క్రైం, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి) : డబుల్ క్లైమ్ కేసులో నిందితుడిగా ఉన్న సత్యనారాయణ సోమవారం జోగుళాంబ గద్వాల జిల్లా కోర్టులో లొంగిపోయాడు. పట్టణ ఎస్‌ఐ కల్యాణ్‌కుమార్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ల్యాండ్ అక్విజేషన్‌లో జరిగిన డబుల్ క్లయిమ్ వ్యవహారం ఇటీవలే జోగుళాంబ గద్వాల జిల్లాలో సంచలనం సృష్టించింది. నెట్టెంపాడు ఎత్తిపోతల పథకం, జూరాల హైడల్ ప్రాజెక్టులో ముంపునకు గురవుతున్న భూములకు డబుల్ క్లైమ్ చేసి రూ. 3.08 కోట్ల పరిహారాన్ని స్వాహా చేశారు. ఈ సొమ్మును కోర్టు సూపరింటెండెంట్ సత్యనారాయణ, తన భార్య లలిత ఖాతాకు బదిలీ చేయించుకున్నాడు. ఈ వ్యవహారం బయట పడటంతో గత నెల 22న కేసు నమోదయ్యింది. అప్పటి నుంచి నిందితులిద్దరూ పరారీలో ఉండగా, పోలీసులు గాలింపు చర్యలు చేపట్టారు. ఈ క్రమంలో ప్రధాన నిందితుడైన సత్యనారాయణ సోమవారం కోర్టులో లొంగిపోయారు. న్యాయాధికారి ఆదేశం మేరకు ఆయనను రిమాండ్‌కు తరలించారు. మరో నిందితురాలు లలిత ఆచూకీ లభించలేదు.

నేడో రేపో పోలీసు కస్టడీకి..!

డబుల్ క్లైమ్ కేసులో ఎవరెవరి ప్రమేయం ఉందో పూర్తి వివరాలు రాబట్టేందుకు నేడో, రేపో సత్యనారాయణను కస్టడీలోకి తీసుకునేందుకు పోలీసులు సిద్ధమవుతున్నట్లు తెలిసింది. ఈ వ్యవహారంలో సత్యనారాయణ, లలిత దంపతులతో పాటు పలువురు ప్రముఖులు ఉన్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. వారిలో రాజకీయ పలుకుబడి ఉన్నకొందరు తమ పేర్లు బయట పెట్టకుండా చూడాలని నిందితుడిని కోరినట్లు విశ్వసనీయంగా తెలిసింది. అయితే డబుల్ క్లైమ్ పేరుతో స్వాహా చేసిన సొమ్ము ఇంకా ఎక్కువ గానే ఉన్నట్లు జిల్లాలో చర్చ కొనసాగుతోంది. నిందితుడిని కస్టడీకి తీసుకొని విచారిస్తే పూర్తి వివరాలు వెలుగు చూసే అవకాశముందన్న అభిప్రాయం వ్యక్తం అవుతోంది.

సీడ్ ఆర్గనైజర్ బండ్ల రాజశేఖర్‌రెడ్డి అరెస్ట్

» కర్ణాటక రాష్ట్రం, రాయిచూరులో పట్టుబడిన నిందితుడు » వెల్లడించిన సీఐ టంగుటూరి శ్రీను

గద్వాల క్రైం, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి) : ఆత్మహత్యాయత్నం చేసి, మృతి చెందిన బాలిక కేసులో ప్రధాన నిందితుడు బండ్ల రాజశేఖర్ రెడ్డిని ఆదివారం అరెస్ట్ చేసినట్లు సీఐ టంగుటూరి శ్రీను తెలిపారు. జోగు ళాంబ గద్వాల జిల్లా కేంద్రంలోని సీఐ కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన కేసు వివరాలను వెల్లడించారు. మల్దకల్ మండలంలోని ఓ గ్రామానికి చెందిన బాలిక బండ్ల రాజశేఖర్‌రెడ్డి ఇంట్లో పని చేస్తుండేది. ఆమెపై బంగారు నగల దొంగతనం మోపడంతో మనస్తాపానికి గురై గత నెల 11న పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నం చేసింది. కర్నూల్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ 24వ తేదీన మృతి చెందింది. ఈ కేసులో ప్రధాన నిందితుడైన సీడ్ ఆర్గనైజర్ బండ్ల రాజశేఖర్‌రెడ్డి పరారయ్యాడు. ఆయన ఆచూకీ కోసం పోలీసు శాఖ ఆరు బృందాలను ఏర్పాటు చేసింది. కర్ణాటక, తమిళనాడు, మహారాష్ట్ర, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో తనిఖీలు చేసింది. ఈ క్రమంలో ఆదివారం కర్ణాటకలోని రాయిచూర్‌లో నిందితుడు బండ్ల రాజశేఖర్‌రెడ్డిని అరెస్ట్ చేసి గద్వాలకు తీసుకొచ్చారు.

రాత్రి ఆయనను సీఐ కార్యాలయంలోనే ఉంచి, సోమవారం జిల్లా ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి వైద్య పరీక్షలు చేయించారు. అనంతరం కోర్టులో హాజరు పర్చగా, న్యాయాధికారి ఆదేశం మేరకు రిమాండ్‌కు తరలించినట్లు సీఐ వివరించారు. ఈ కేసులో ఇంకా ఎవరైనా ఉన్నారా, మల్దకల్ ఎస్‌ఐపై ఎలాంటి చర్యలు తీసుకుంటారని విలేకరులు ప్రశ్నించగా, విచారణ అనంతరం బాధ్యులపై చర్యలు తీసుకుంటామని బదులిచ్చారు. అయితే అంతకుముందు నిందితుడు ముందస్తు బెయిల్ కోసం రెండు సార్లు ప్రయత్నించినా, ఫలితం దక్కలేదని సమాచారం.



జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలో బండ్ల రాజశేఖర్‌రెడ్డికి చెందిన మెడికల్ రిపోర్టులను పరిశీలిస్తున్న వైద్యురాలు

ఇంటర్వ్యూ..



వైద్య సేవలను ప్రజలు వినియోగించుకోవాలి

- డాక్టర్ శివకుమార్, పీహెచ్‌సీ, బిజినేపల్లి

బిజినేపల్లి, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజా ఆరోగ్య పరిరక్షణకు ఉచిత వైద్య సేవలు అందిస్తుందని బిజినేపల్లి ప్రాథమిక వైద్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ శివకుమార్ తెలిపారు. ప్రైవేట్ ఆసుపత్రులకు వెళ్లి ఆర్థిక ఇబ్బందులకు గురికావద్దని, ప్రభుత్వ ఆసుపత్రుల్లో అందిస్తున్న వైద్య సేవల గురించి ఆయన 'ఆంధ్రజ్యోతి'కి ఇచ్చిన ఇంటర్వ్యూలో వివరించారు.

ఎలాంటి వైద్య సేవలు అందుబాటులో ఉన్నాయి?

గ్రామీణ ప్రాంత ప్రజలకు వైద్య సేవలను మరింత దగ్గరగా తీసుకెళ్లేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆశ వర్కర్లు, ఆరోగ్య మిత్రల ద్వారా ప్రతీ ఒక్కరి హెల్త్ రికార్డు వివరాలను సేకరిస్తుంది. అలాగే బాలింతలకు, గర్భిణులకు, చిన్నపిల్లలకు, దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడే వారిని గుర్తించి వారి ఇంటి వద్దకే వెళ్లి మందులు అందజేయడం, వ్యాధి తీవ్రతను బట్టి మెరుగైన చికిత్స కోసం సంబంధిత ఆసుపత్రికి తీసుకెళ్లడం వంటి సేవలు ప్రభుత్వం చేపట్టింది.

పీహెచ్‌సీలు ఎన్ని ఉన్నాయి?

మండల కేంద్రంతో పాటు పాలెం, లట్టుపల్లి గ్రామాల్లో మూడు పీహెచ్‌సీలు ఉన్నాయి. వీటి పరిధిలో గంగారం, మంగనూర్, వడ్డెమాన్, వెల్గొండ, వట్టెం తదితర గ్రామాల్లో ఉప వైద్య కేంద్రాలు ఉన్నాయి. వైద్య ఆరోగ్య సిబ్బంది నిత్యం ఆయా కేంద్రాల్లో చిన్న పిల్లలకు, గర్భిణులకు ఉచితంగా టీకాలు, మందులు అందజేసి, దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులకు కలుసుకొని వారి ఆరోగ్య పరీక్షలు చేసి అవసరమైన మందులు అందజేస్తున్నాం.

అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నారా?

వైద్య ఆరోగ్యశాఖ ద్వారా చేపట్టే ప్రతీ కార్యక్రమాన్ని గ్రామాల్లో నిర్వహించి అవగాహన కల్పిస్తున్నాం. ప్రతీ శుక్రవారం డ్రైడే పాటించి దోమల నివారణ చేపడుతున్నాం. సంపూర్ణ ఆరోగ్యంతో జీవించేందుకు ఆహార నియమాలు, వ్యాయామం, పౌష్టికాహారం అవశ్యకత, రక్తహీనత అధిగమించేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పిస్తున్నాం.

మండల వ్యవసాయాధికారిణిగా దీప్తి

ఊర్కొండ, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి) : మండల వ్యవసాయ కేంద్రంలోని దీప్తి సోమవారం మండల కేంద్రంలోని రైతు వేదికలో బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతులకు ఎల్లవేళలా సహాయ సహకారాలు అందిస్తానని, రైతులు తమ పంటల సస్య రక్షణ కోసం తమను సంప్రదించాలని కోరారు. అనంతరం ఆమెను ఏఈవోలు శాలువాతో ఘనంగా సన్మానించారు. బాధ్యతలు చేపట్టిన అనంతరం మండల కేంద్రంలోని ఫెస్టిసైడ్ దుకాణాలను పరిశీలించారు. ఏఈవోలు అరుణ, మానస, మనోజ్ తదితరులు ఉన్నారు.

● పెంట్లవెల్లి(ఆంధ్రజ్యోతి): మండల వ్యవసాయ అధికారిగా సోమవారం వికాస్ బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పని చేస్తున్న ఇన్‌చార్జి వ్యవసాయ అధికారి చిన్న హుస్సేన్ కొల్లాపూర్ పూర్తి స్థాయి వ్యవసాయ అధికారిగా బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతుల సమస్యల పరిష్కారం కోసం, అభివృద్ధి కోసం కృషి చేస్తామని వారు పేర్కొన్నారు.

లింకులను ఓపెన్ చేయొద్దు

లింగాల, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి) : సర్వే పేరుతో వచ్చే లింకులను ఓపెన్ చేయొద్దని లింగాల మండలం ఎస్‌ఐ నాగరాజుయాదవ్ అన్నారు. సోమవారం విలేకర్ల సమావేశంలో వారు మాట్లాడారు. సర్వే పేరుతో మొబైల్స్‌కి మెయిల్స్‌కు లింకులు పంపి ఖాతాలో డబ్బులు ఖాళీ చేస్తారని సర్వే పేరుతో ఎలాంటి లింకులు వచ్చినా తెరవొద్దని వచ్చిన ఓటీపీ వివరాలు చెప్పొద్దని ప్రజలకు సూచించారు.

నాణ్యమైన భోజనం అందించాలి

పదర, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): పాఠశాలలో విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని వంశీయువసేన అధ్యక్షుడు నెల్లికంటి శివకుమార్ అన్నారు. ఆయన సోమవారం మండలంలోని వంకేశ్వరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పర్యటించారు. ఆయనతో పాటు గ్రామ పంచాయతీ కార్యదర్శి రాజరత్నం,ఉపాధ్యాయులు నీరంజన్ తదితరులు ఉన్నారు.

స్వాములకు అన్నదాన ప్రసాదం

కందనూలు, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రానికి చెందిన మణికంఠ సన్నిధానంలో 30మంది యువకులు సుదర్శన్ గురుస్వామి ఆధ్వర్యంలో అచ్చంపేట పరిధిలోని ఉమామహేశ్వర క్షేత్రంలో అయ్యప్ప మాలధారణ స్వీకరించారు. ఈ సందర్భంగా సుదర్శన్ గురుస్వామి మాట్లాడుతూ 41రోజులు నియమ నిష్టలతో ప్రత్యేక దీక్ష చేస్తూ ప్రతిరోజు నాగర్‌కర్నూల్ అయ్యప్ప దేవాలయ ప్రాంగణంలో స్వాములకు అన్నప్రసాదం అందుబాటులో ఉన్నట్లు తెలిపారు. గురుస్వాములు వెంకటయ్య, గురుస్వామి శివ, గురుస్వామి శ్రీధర్, గురుస్వామి, అయ్యప్పస్వాములు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికే ప్రజావాణి

చారకొండ, నవంబరు 11: (ఆంధ్రజ్యోతి) సమస్యల పరిష్కారానికే ప్రజావాణి కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ సునిత అన్నారు.

ఈ సందర్భంగా ఆమె మాట్లాడు తూ సోమవారం నిర్వహించిన ప్రజావాణికి ఎలాంటి ఫిర్యాదులు రాలేదని అన్నారు. డిప్యూటీ తహసీల్దార్ విద్యాధరిరెడ్డి, వీఎల్‌వో షేక్ మదర్, సీనియర్ అసిస్టెంట్ శ్రీను, ఆర్ఐ రామకృష్ణ పాల్గొన్నారు.

సీసీఐ నిబంధనలతో నిలిచిన పత్తి కొనుగోళ్లు

- కొత్త నిబంధనలను పూర్తిగా వ్యతిరేకిస్తున్న పత్తి జిన్నింగ్ మిల్లర్లు
- కొనుగోళ్లు జరగకపోవడంతో ఆందోళన చెందుతున్న రైతులు
- సోమవారం నిలిచిన కొనుగోళ్లు



తాడూరు మండల పరిధిలోని ఇంద్రకల్ పత్తి మిల్లుల వద్ద పత్తితో నిండి ఉన్న వాహనాలు

తాడూరు, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి) : ఆరుగాలం రైతులు కష్టపడి సాగు చేసి పండించిన పత్తి పంటకు ఆది నుంచి ఇప్పటి వరకు అన్నీ కష్టాలే ఎదురవుతున్నాయి. విత్తనాలు మొలకెత్తినప్పటి నుంచి పత్తి ఏరుకుని మిల్లుకు వచ్చే వరకు అన్ని సమస్యలను అధిగమించి వచ్చినప్పటికీ పత్తి జిన్నింగ్ మిల్లుల వద్ద సమస్యలు రావడంతో పత్తి మిల్లులు ఆగిపోయాయి. వివరాల ప్రకారం..కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా నిబంధనల మేరకు గత కొన్ని సంవత్సరాలుగా స్థానిక మిల్లుల ద్వారా పత్తి కొనుగోలు నిర్వహిస్తున్నారు. ఈ ఏడాది సీసీఐ కొత్త నిబంధనలు తేవడంతో తెలంగాణ కాటన్ మిల్లర్స్ అసోసియేషన్ ఆ నిబంధనలను తీవ్రంగా వ్యతిరేకిస్తోంది. ఈ నెల 4వ తేదీ నుంచి 8వ తేదీ వరకు నాలుగు రోజులు మాత్రమే పత్తి కొనుగోలు జరిగాయి. రెండవ శనివారం ఆదివారం కావడం మూలంగా సెలవుదినంగా ఉండింది. సోమవారమన్న పత్తి కొనుగోలు ప్రక్రియ ప్రారంభమవుతుందని ఆశించిన అన్నదాతలకు తెలంగాణ మిల్లర్స్ అసోసియేషన్ నుంచి అనుకోని ఘటన చోటు చేసుకుంది. పత్తి కొనుగోలు ఆగిపోవడం మూలంగా అన్నదాతలు వాహనాల్లో మిల్లుల దగ్గరకు తీసుకొచ్చిన పత్తితో పడిగాపులు కాయాల్సిన పరిస్థితి నెలకొంది. సీసీఐ పెట్టిన ఎల్-1, ఎల్-2, ఎల్-3పేరుతో మిల్లర్లను కఠిన నిబంధనలతో ఇబ్బందులకు గురి చేస్తున్నారన్న అంశంపై ఈ నిరసన కొనసాగుతుంది. దీంతో ఈ ప్రభావం రైతులపై పడటంతో అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. బహిరంగ మార్కెట్‌లో పత్తి ధర 6వేల నుంచి 6700లోపు మాత్రమే ఉంటుండటంతో కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన సీసీఐకి పత్తిని విక్రయించుకున్నట్లయితే ప్రభుత్వం మద్దతు ధర పత్తి క్వింటాల్‌కు దాదాపుగా 7500రూపాయలు ఉండవచ్చునన్న రైతుల ఆశలు ఆడియాశలుగా మారుతున్నాయి. కావున తెలంగాణ ప్రభుత్వం సీసీఐ ప్రతినిధులతో మాట్లాడి సంస్థకు కాటన్ జిన్నింగ్ మిల్లు అసోసియేషన్‌ల మధ్యలో సయోధ్య కుదిరించి పత్తి కొనుగోళ్లు సజావుగా సాగే విధంగా అధికారులు, ప్రజాప్రతినిధులు చర్యలు తీసుకోవాలని అన్నదాతలు కోరుతున్నారు.

లేకుంటే అన్నదాతలు రోడ్లు ఎక్కే పరిస్థితులు తీసుకురావద్దనే హెచ్చరించారు.

బీసీకాలనీ ఇళ్లకు నెంబర్లు కేటాయించాలి

- కాలనీ పరిరక్షణ కమిటీ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట ధర్నా



కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహిస్తున్న బీసీ కాలనీ పరిరక్షణ కమిటీ సభ్యులు

నాగర్‌కర్నూల్ టౌన్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): నాగర్‌కర్నూల్ మునిసిపాలిటీ పరిధిలోని 17వ వార్డు బీసీ కాలనీ ఇళ్లకు నెంబర్లు కేటాయించి క్రమబద్ధీకరించాలని కాలనీ పరిరక్షణ కమిటీ ఆధ్వర్యంలో సోమవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించి అదనపు కలెక్టర్ కె.సీతారామారావుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా బీసీ కాలనీ పరిరక్షణ కమిటీ అధ్యక్షుడు వర్థం పర్వతాలు మాట్లాడుతూ జిల్లా కేంద్రంలోని పేదలకు ఇంటి స్థలాలు ఇవ్వాలని సీపీఎం ఆధ్వర్యంలో ఇరవై ఏళ్ల క్రితం శ్రీపురం రోడ్డులో బీసీకాలనీలో ఒక్కొక్కరికి 110 గజాల చొప్పున అప్పటి ప్రభుత్వం స్థలాలు కేటాయించిందని పేర్కొన్నారు. ప్రభుత్వం కేటాయించిన స్థలంలో పేదలు ఇల్లు కట్టుకుని నివాసం ఉంటున్న వారికి నేటికి ఇంటి నెంబర్లు ఇవ్వలేదన్నారు. అదేవిధంగా కాలనీలో మంచినీరు, డ్రైనేజీలు లేకపోవడంతో పేదలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కలెక్టర్ తక్షణమే స్పందించి బీసీ కాలనీ ఇళ్లను క్రమబద్ధీకరించి కాలనీలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని ఆయన కోరారు. సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఆర్.శ్రీనివాస్, కందికొండ గీత, అశోక్, కేవీపీఎస్ జిల్లా అధ్యక్షుడు అంతటి కాశన్న, నాయకులు రవి, వెంకటేష్, కురుమయ్య, వెంకటయ్య, కృష్ణయ్య, బాలయ్య, లక్ష్మయ్య, సైదమ్మ, మురళి, జ్యోతి, వెంకటమ్మ, కృష్ణమ్మ, అలివేల, చంద్రకళ తదితరులు పాల్గొన్నారు.

అబుల్ కలాం ఆజాద్ ఆశయాలను కొనసాగిద్దాం



కల్వకుర్తి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో అబుల్ కలాం ఆజాద్ చిత్ర పటానికి నివాళులర్పిస్తున్న మాజీ సర్పంచ్ బృంగి ఆనంద్‌కుమార్

కల్వకుర్తి/కొల్లాపూర్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): మౌలానా అబుల్ కలాం ఆజాద్ ఆశయాలను కొనసాగిద్దామని కల్వకుర్తి మాజీ సర్పంచ్ బృంగి ఆనంద్‌కుమార్ అన్నారు. కల్వకుర్తి పట్టణంలో ముస్లిం జేఏసీ ఆధ్వర్యంలో మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతిని ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఆయన చిత్ర పటానికి ముస్లిం జేఏసీ నాయకులతో కలిసి ఆయన పూల మాల వేసి నివాళులర్పించారు. అనంతరం ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు చిమ్ముల శ్రీకాంత్‌రెడ్డి, నాయకుడు రమాకాంత్‌రెడ్డి, ముస్లిం జేఏసీ నాయకుడు షానవాజ్‌ఖాన్, ముస్లిం జేఏసీ నాయకులు ఏజాజ్, సయ్యద్‌మసూద్, కాంగ్రెస్ నాయకులు రేష్మాబేగం తదితరులు పాల్గొన్నారు. అలాగే, కల్వకుర్తి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతిని ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఆయన చిత్ర పటానికి కల్వకుర్తి మాజీ సర్పంచ్ బృంగి ఆనంద్‌కుమార్, పలువురు నాయకులు కలిసి ఘన నివాళులర్పించారు. మైనార్టీ బాలికల గురుకుల కళాశాల, పాఠశాలలో ఆజాద్ జయంతిని సోమవారం ఘనంగా జరుపుకున్నారు. ప్రిన్సిపాల్ చంద్రకళ, నాయకులు తాహేర్‌ఆలీ, విద్యార్థినీ విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. కల్వకుర్తి పట్టణంలోని ప్రభుత్వ డి గ్రీ కళాశాలలో ఆజాద్ జయంతిని ఘనంగా జరుపుకున్నారు. కళాశాల అధ్యాపకులు శ్రీనివాసులు, అధ్యాపకులు, విద్యార్థులు ఉన్నారు.

● కొల్లాపూర్ పట్టణంలోని మైనార్టీ గురుకుల పాఠశాలలో మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాలలో జరిగిన జాతీయ విద్యా దినోత్సవం కార్యక్రమంలో మునిసిపల్ చైర్ పర్సన్ మేకల రమ్య పాల్గొన్నారు. విద్యార్థులు నిర్వహించిన నృత్య ప్రదర్శన అలరించాయి. వైస్ చైర్ పర్సన్ షైముదా బేగం, 13వ వార్డు కౌన్సిలర్ మేకల శిరీష, కిరణ్‌యాదవ్, పాఠశాల ప్రిన్సిపాల్ ఉపాధ్యాయులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

కాస్మెటిక్ చార్జీలు పెంపు

అచ్చంపేటటౌన్ (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకొని కాస్మెటిక్, డైట్ చార్జీలు పెంచడం జరిగిందని ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ అన్నారు. అబుల్ కలాం ఆజాద్ జయంతిని పురస్కరించుకొని సోమవారం పట్టణంలోని మైనార్టీ గురుకుల పాఠశాలలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థుల సంక్షేమం కోసం కాస్మోటిక్ డైట్ చార్జీలు పెంచినందుకు ఎమ్మెల్యేను విద్యార్థులు పుష్పగుచ్ఛంతో సత్కరించారు. ప్రిన్సిపాల్ యాదగిరి, కోఆర్డినేటర్ చంద్రశేఖర్,జిల్లా గ్రంథాలయ చైర్మన్ రాజేందర్,నాయకులు మల్లయ్య, రామనాథం, పాఠశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ప్రజావాణి ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలి

- అదనపు కలెక్టర్ కె.సీతారామారావు

- ఈ వారం 51 వినతులు



కలెక్టరేట్ ప్రజావాణిలో వినతులను స్వీకరిస్తున్న అదనపు కలెక్టర్ కె.సీతారామారావు

నాగర్‌కర్నూల్ టౌన్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): ప్రజావాణిలో వచ్చిన ఫిర్యాదులను నిర్లక్ష్యం చేయకుండా సత్వరమే పరిష్కరించాలని జిల్లా అదనపు కలెక్టర్ కె.సీతారామారావు అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ ప్రజావాణికి మొత్తం 51 వినతులు అందాయి. వివిధ సమస్యలపై ప్రజల నుంచి అందిన ఫిర్యాదులను రెవెన్యూ అదనపు కలెక్టర్ స్వీకరించి పరిశీలించిన అనంతరం విచారణ కోసం సబంధిత శాఖల అధికారులకు బదిలీ చేశారు. కలెక్టరేట్ పరిపాలనాధికారి చంద్రశేఖర్, వివిధ శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

అక్షరాస్యులుగా తీర్చిదిద్దాలి

జిల్లాలో నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా తీర్చిదిద్దేందుకు అధికారులు సమన్వయంతో పని చేయాలని జిల్లా రెవెన్యూ అదనపు కలెక్టర్ కె.సీతారామారావు అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో న్యూ ఇండియా లిటరసీ ప్రోగ్రాం అమలుపై సంబంధిత శాఖల అధికారులతో అదనపు కలెక్టర్ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో 27,174 మంది నిరక్షరాస్యులను మొదటి దశలో గుర్తించామని, అందులో 10,870 మంది పురుషులు, 16,304 మంది స్త్రీలు ఉన్నారని పేర్కొన్నారు. గుర్తించిని నిరక్షరాస్యులందరినీ చదువు నేర్పించి మారుతున్న కాలానికి అనుగుణంగా మార్పులు తీసుకురావాలని ఆదేశించారు. జిల్లా వయోజన విద్యాశాఖ అధికారి శ్రీనివాస్‌రెడ్డి, అధికారులు పాల్గొన్నారు.

సకల జనుల ప్రయోజనం కోసమే సమగ్ర సర్వే

మన్ననూర్/తాడూరు/తిమ్మాజిపేట/దోమలపెంట, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): సకల జనుల ప్రయోజనం కోసమే కాంగ్రెస్ ప్రభుత్వం సమగ్ర సర్వే నిర్వహిస్తోందని ఎమ్మెల్యే వంశీకృష్ణ అన్నారు. అమ్రాబాద్ మండలం మాచారం గ్రామంలో అధికారులు నిర్వహిస్తున్న సమగ్ర సర్వేలో పాల్గొని మాట్లాడారు. అనంతరం ఎల్మపల్లి గేటు వద్ద ఎమ్మెల్యే నిధులతో బస్‌షెల్టర్ నిర్మాణానికి భూమి పూజ చేశారు. డీపీవో రామ్మోహన్‌రావు, ఆర్డీవో మాధవి, ఎంపీడీవో వెంకటయ్య, తహసీల్దార్ శైలేంద్ర కుమార్, పంచాయతీ కార్యదర్శి ముత్యం, మాజీ ఎంపీపీ శ్రీనివాసులు, మాజీ ఎంపీటీసీ సభ్యుడు శ్రీనివాసులు, కాంగ్రెస్ నాయకులు రేణయ్య, జూలూరి సత్యనారాయణ, సంభు వెంకట్‌రమణ, రహీం, మేరాజ్ పాల్గొన్నారు.

● రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేలో ఎలాంటి తప్పులు దొర్లకుండా జాగ్రత్తగా నిర్వహించాలని ఎన్యుమరేటర్లకు జిల్లా డీఆర్‌డీవో ఓబులేష్ సూచించారు. సోమవారం తాడూరు మండల కేంద్రంలో సర్వే జరుగుతున్న తీరును ఆయన క్షేత్రస్థాయిలో పరిశీలించారు. మండల కేంద్రంతోపాటు మండలంలోని 24గ్రామపంచాయతీల పరిధిలో సమగ్ర సర్వే కొనసాగుతుందని ఎంపీడీవో బ్రహ్మచారి వివరించారు.

● తిమ్మాజిపేటలో మండల వ్యవసాయ అధికారి కమల్‌కుమార్ శనిగలగడ్డతండాలో ఏపీఎం శ్రీహరిలు జరుగుతున్న సర్వేను పర్యవేక్షించి వివరాలను సర్వే అధికారులు అడిగి తెలుసుకున్నారు. అదేవిధంగా అన్ని వర్గాల ప్రజలు సర్వే అధికారులకు సహకరించాలని కుటుంబ సభ్యులకు సంబంధించిన ఆధార్‌కార్డులు, రేషన్‌కార్డు, ఆ ఇంటి యజమానికి భూమి ఉన్నట్లయితే పుస్తకం అందుబాటులో ఉంచుకోవాలన్నారు.

● కులగణన ఇంటింటి సర్వేకు గ్రామస్థులందరు సహకరించాలని రాష్ట్ర యువజన కాంగ్రెస్ లీగల్ సెల్ చైర్మన్ చత్రునాయక్ కోరారు. సోమవారం దోమలపెంట మండలం వటువర్లపల్లిలో గ్రామస్థులతో కలిసి సర్వేలో పాల్గొన్నారు. పంచాయతీ కార్యదర్శి రాంబాబు, నాయకులు సాదిక్, శ్రీను, భరత్ ఉన్నారు.

మహిళపై దాడి కేసు నమోదు

చారకొండ, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి) చారకొండ మండల కేంద్రానికి చెందిన చింతపల్లి నిర్మలమ్మపై అకారణంగా దాడి చేసి గాయపరిచిన అదే గ్రామానికి చెందిన కాటమయ్యగౌడ్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ శంషుద్దీన్ తెలిపారు. ఆదివారం నిర్మలమ్మ తన వ్యవసాయ పొలానికి వెళ్లగా అప్పటికే అక్కడ ఉన్న ఆమె బావ కుమారుడు అకారణంగా దూషించడమే కాకుండా తాటిమట్టతో కొట్టి గాయ పరిచినట్లు బాధితురాలు ఫిర్యాదుతో సోమవారం అతనిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

అర్హులకు రైతు రుణమాఫీ చేయాలి

కొల్లాపూర్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): కొల్లాపూర్ నియోజకవర్గ పరిధిలోని అర్హులైన రైతులందరికీ రైతు రుణమాఫీ చేయాలని డిమాండ్ చేస్తూ బీజేపీ నాయకులు ఆర్డీవో బన్సీలాల్‌కు వినతిపత్రం అందజేశారు. పెంట్లవెళ్లి సొసైటీలో దాదాపు 500 మంది రైతులు రుణాలు తీసుకున్నారు. రైతుల రుణాలను మాఫీ చేసే విధంగా చొరవ తీసుకోవాలని ఆర్‌డీవోను కోరారు.

నాగర్‌కర్నూల్ నుంచి జడ్చర్లకు నూతన బస్సు ఏర్పాటు



సిర్సవాడలో నూతనంగా ఏర్పాటు చేసిన ఆర్టీసీ బస్సును ప్రారంభిస్తున్న గ్రామస్థులు

తాడూరు, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రం నుంచి ఇంద్రకల్, ఐతోల్, సిర్సవాడ, పాపగల్, నేరేళ్లపల్లి, బుద్దసముద్రం, ఆవంచ, నసుర్లబాద్ మీదుగా జడ్చర్ల పట్టణానికి పరిసర గ్రామాల ప్రజల కోరిక మేరకు నూతన బస్సును ఏర్పాటు సోమవారం ఆర్టీసీ అధికారులు ఏర్పాటు చేశారు. దీంతో రహదారి వెంట ఉన్న గ్రామాల్లోని ప్రజలు కొత్తగా వస్తున్న బస్సుకు కొబ్బరికాయలు కొడుతూ హారతి ఇస్తూ కొబ్బరి మండలు కొట్టి ప్రత్యేక పూజలు నిర్వహించి బస్సును పంపించడం జరిగింది. ఈ సందర్భంగా స్థానిక నాగర్‌కర్నూల్ ఎమ్మెల్యే కూచకుళ్ల రాజేష్‌రెడ్డి, ఎమ్మెల్సీ కూచకుళ్ల దామోదర్‌రెడ్డిలకు ఈ గ్రామాలకు చెందిన ప్రయాణికులు, ప్రజలు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

ఆలయం వద్దే టెండర్లు నిర్వహించాలి

ఊర్కొండ, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఊర్కొండపేట అభయాంజనేయ స్వామి ఆలయం ఆవరణలోని టెండర్లు నిర్వహించాలని బీజేవైఎం మండల నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం ఆలయం ఆవరణలో ముఖ్య నాయకులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా బీజేవైఎం మండల సీనియర్ నాయకుడు అరవింద్ గౌడ్ మాట్లాడుతూ ఊర్కొండపేట గ్రామ శివారులో ప్రసిద్ధిగాంచిన అభయాంజనేయ స్వామి ఆలయం టెండర్లను స్థానికంగా నిర్వహించాలన్నారు. ప్రతీ సంవత్సరం ఆలయం వద్ద నిర్వహించే టెండర్లను మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని దేవాదాయ, ధర్మాదాయ శాఖ కార్యాలయంలో నిర్వహించడం సమంజసం కాదని అన్నారు. ఆలయం ఆవరణలో టెండర్లు నిర్వహించడం అనవాయితీగా వస్తున్నదని, అధికారులు జిల్లా కేంద్రంలో నిర్వహిస్తామని నోటీసులు జారీ చేయడం చూస్తుంటే దేవాదాయ శాఖ అధికారులు, టెండర్ల నిర్వాహకులు కుమ్మక్కు అయ్యారని ఆరోపించారు. దేవాదాయ శాఖ అధికారులు ఇప్పటికైనా స్పందించి ఆలయం ఆవరణలో టెండర్లు కొనసాగేటట్లు చూడాలని డిమాండ్ చేస్తున్నామని తెలిపారు. బీజేవైఎం నాయకులు సురేందర్, రాఘవేందర్ తదితరులు ఉన్నారు.

రైతులు పండించిన ప్రతీ గింజను కొనుగోలు చేస్తాం

-ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ



పల్కపల్లిలో వరి కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

అచ్చంపేటటౌన్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): రైతులు పండించిన ప్రతీ గింజను రాష్ట్ర ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ అన్నారు. ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో మండల పరిధిలోని పల్కపల్లి గ్రామంలో వరి కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వరికి రాష్ట్ర ప్రభుత్వం సన్నాలకు రూ.500 బోనస్‌తో పాటు మద్దతు ధర రూ.2300 అందిస్తూ రైతుల సంక్షేమం కోసం పనిచేస్తున్నది తెలంగాణ ప్రభుత్వమన్నారు. నాయకులు గోపాల్ రెడ్డి, సింగిల్ విండో చైర్మన్ రాజిరెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

'దళారులను నమ్మి మోసపోవద్దు'

పెంట్లవెల్లి(ఆంధ్రజ్యోతి): రైతులు దళారులను నమ్మి మోసపోవద్దని మాజీ వైస్ ఎంపీపీ భీంరెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు నర్సింహయాదవ్ అన్నారు. సోమవారం మండల పరిధిలోని జటప్రోలు, గోప్లాపూర్, పెంట్లవెల్లి గ్రామాల్లో వరి కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. కాంగ్రెస్ నాయకులు గోవిందుగౌడ్, మదుగం బాలరాజు, మోత్కూరు నాగిరెడ్డి, బోగ్యం నర్సింహ్మానాయుడు, చిన్న శ్రీను, గోపాల్, ఏపీఎం గౌస్ పాల్గొన్నారు.

వరి కొనుగోలు కేంద్రం ప్రారంభం

ఊర్కొండ (ఆంధ్రజ్యోతి): మండలంలోని బొమ్మరాజుపల్లిలో సోమవారం ఐకేపీ ఆధ్వర్యంలో వరి కొనుగోలు కేంద్రం ప్రారంభించారు. రైతులు పండించిన ప్రతి ధాన్యపు గింజను కొనుగోలు చేస్తామని వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో కృష్ణయ్య, ఏపీఎం సహదేవ్, సీసీ సునీల్ కుమార్ రెడ్డి, నాయకులు రాఘవేందర్, తిరుపతి రెడ్డి, అంజనేయులు తదితరులు ఉన్నారు.

విద్యుత్ ఎంప్లాయీస్ 327 యూనియన్ నూతన కార్యవర్గం ఎన్నిక

కల్వకుర్తి, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి) : కల్వకుర్తి సబ్ డివిజన్ విద్యుత్ ఎంప్లాయీస్ 327 యూనియన్ నూతన కార్యవర్గాన్ని నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలో సోమవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీధర్‌తోపాటు జిల్లా నాయకులు లక్ష్మయ్య, శ్రీనివాసులు, శ్రీధర్‌ఆచారి, శ్రీనివాసరాజు, రాఘవేందర్, తదితర ముఖ్య నాయకుల సమక్షంలో కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. సబ్ డివిజన్ అధ్యక్షులుగా శ్రీనివాసులు, ప్రధాన కార్యదర్శిగా వరప్రసాద్, కోశాధికారిగా కేశవులు, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా స్వాతిలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నూతనంగా ఎన్నికైన కార్యవర్గ సభ్యులను రాష్ట్ర, జిల్లా నాయకులు అభినందించారు. కల్వకుర్తి సబ్ డివిజన్‌లో యూనియన్ బలోపేతానికి కృషి చేస్తామని ఈ సందర్భంగా అధ్యక్షుడు శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి వరప్రసాద్ తెలిపారు.

పూర్వ విద్యార్థుల అపూర్వ కలయిక



పెద్దకార్పాముల హైస్కూల్‌లో గురువులతో పూర్వ విద్యార్థులు

పెద్దకొత్తపల్లి, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): రెండు దశాబ్దాల క్రితం బాల్యంలో అందరూ కలిసి ఒకే పాఠశాలలో విద్యా బుద్ధులు నేర్చుకున్న పూర్వ విద్యార్థులు ఒక్కటయ్యారు. బాల్య స్మృతులను గుర్తు చేసుకున్నారు. పెద్దకొత్తపల్లి మండలం పెద్దకార్పాముల జిల్లా పరిషత్ పాఠశాలలో 2003-2004 పదవ తరగతి పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనాన్ని అదే పాఠశాలలో సోమవారం ఘనంగా జరుపుకున్నారు. తమకు విద్యా బుద్ధులు నేర్పిన ఉపాధ్యాయులకు పూర్వ విద్యార్థులు ఘన స్వాగతం పలికారు. గురువులు వెంకటేశ్వర్‌చారి, పాపల్ రాయుడు, విశ్వేశ్వర్‌రెడ్డి, శేఖర్, మన్సూర్‌ను సన్మానించారు. గురువులతో పాటు కలిసి తీపి గుర్తుగా పూర్వ విద్యార్థులు గ్రూపు ఫోటో దిగారు. పూర్వ విద్యార్థులు కొల్లె ఈశ్వర్, వినోద్ రెడ్డి, బుడుగు మల్లయ్య, కరీం, సికిందర్, ఎల్లస్వామి, రంజిత్‌కుమార్, జహంగీర్, కృష్ణయ్య, టి.రాములు, అశోక్‌రెడ్డి, వాజిద్, మల్లేష్‌యాదవ్, సతీష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

ఈత చెట్లను నరికిన వారిపై చర్యలు తీసుకోవాలి

-ఎక్సైజ్ ఎస్ఐకి వినతి పత్రం అందజేస్తున్న నాయకులు

కల్వకుర్తి, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి) : కల్వకుర్తి మండలంలో గీత, తాటి చెట్లను నరికిన వారిపై చర్యలు తీసుకోవాలని గీత కార్మికులు సోమవారం పట్టణంలో ఎక్సైజ్ ఎస్ఐకి వినతి పత్రం అందజేశారు. 348, 349 సర్వే నెంబర్లల్లో ఈత, తాటి చెట్లను పెద్ద ఎత్తున నరికివేసి గీత కార్మికులకు ఉపాధి లేకుండా చేశారని బాధ్యులపై చట్టపరమైన తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. వినతి పత్రం సమర్పించిన వారిలో తర్నికల్ గౌడ సంఘం అధ్యక్షుడు పరశురాములుగౌడ్, కల్వకుర్తి మండల గౌడ సంఘం మండ జనరల్ సెక్రటరీ తాళ్ల సురేష్‌గౌడ్, గౌడ సంఘం నాయకులు చెన్నగౌడ్, ప్రశాంత్‌గౌడ్, వెంకటయ్యగౌడ్, జాంగీర్‌గౌడ్, రాములుగౌడ్, నవీన్‌గౌడ్, అరవింద్‌గౌడ్, శ్రీకాంత్‌గౌడ్, తదితరులు ఉన్నారు.

'జనుంపల్లి గ్రామ పంచాయతీని ఎస్సీకి రిజర్వు చేయాలి'

కోడేరు, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని జనుంపల్లి గ్రామ పంచాయతీని ఎస్సీకి రిజర్వు చేయాలని భారత ప్రజాతంత్ర యువజన సమాఖ్య (డీవైఎఫ్ఐ) నాయకులు కోరారు. సోమవారం మండల కేంద్రంలోని తహసీల్ధార్ కార్యాలయంలో తహసీల్ధార్‌కు నాయకులు వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ స్థానిక సంస్థల ఎన్నికలు ప్రారంభమైనప్పటి నుంచి జనుంపల్లి గ్రామంలో ఎస్సీలకు రిజర్వు కాలేదని ఇప్పటికైనా అధికారులు స్పందించి జనుంపల్లి గ్రామ పంచాయతీని ఎస్సీకి రిజర్వు చేయాలని ఆయన అన్నారు.

ఈ కార్యక్రమంలో డీవైఎఫ్ఐ మండల నాయకులు శివశంకర్, శ్రీను, ధర్మేందర్, శివరాజు తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే సహకారంతో రహదారులకు మరమ్మతులు

తిమ్మాజిపేట, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి) : నాగర్‌కర్నూల్ ఎమ్మెల్యే కూచకుళ్ల రాజేష్‌రెడ్డి సహకారంతో తిమ్మాజిపేట మండలంలోని లక్ష్మణ్‌నాయక్‌తండా తువ్వబండతండా, సామ్యతండాలకు వెళ్లే రహదారులకు గిరిజన నాయకులు కాంగ్రెస్ నాయకులు మూడావత్ సురేష్ ఆధ్వర్యంలో మరమ్మతులు చేపట్టారు. సమస్యను ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లగా, ఆయన స్పందించారని కాంగ్రెస్ నాయకులు పీరియా రాజు, శ్రీను, లచ్చిరాం తెలిపారు.

సోమవారం రోడ్డు మరమ్మతులు చేయించినట్లు వారు తెలిపారు.